మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 23-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 355 Issue: 355

Published from Jagitial
Circulated to Telangana

23 జూన్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:47 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి నవమి సా. 4:43 వరకు తరువాత దశమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం హస్త ఉ. 11:51 వరకు తరువాత చిత్తా యోగం వారియ ఉ. 10:08 వరకు కరణం కౌలవ సా. 4:43 వరకు తైతుల తె. 5:22ం వరకు వర్జ్యం రా. 8:35 నుండి రా. 10:19 వరకు దుర్ముహూర్తం ఉ. 8:23 నుండి ఉ. 9:15 వరకు రా. 11:12 నుండి రా. 11:56 వరకు రాహుకాలం మ. 3:33 నుండి సా. 5:11 వరకు యమగండం ఉ. 9:02 నుండి ఉ. 10:40 వరకు గుళికాకాలం మ. 12:18 నుండి మ. 1:56 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:11 నుండి తె. 4:59 వరకు అమృత ఘడియలు తె. 5:30 నుండి ఉ. 7:12 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:44 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# ముక్కలు ముక్కలుగా చెదిరి!

**ఖతార్ గ్యాస్ పోర్టులో భారీ పేలుడు**

**12 మంది భారతీయులు దుర్మరణం**

**మొత్తం 13 మంది మృతి: అధికారులు**

ఖతార్ గ్యాస్ పోర్టులో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఇందులో 13 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు సోమవారం రాత్రి ప్రకటించారు. మృతుల్లో 12 మందిని భారతీయులుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో మొత్తం 66 మంది కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి.

దోహా:ఆదివారం రాత్రి ఖతార్‌లోని రాస్ లఫాన్ ఎల్‌ఎన్‌జీ కాంప్లెక్స్‌లో భారీ పేలుడు జరిగింది. ఖతార్ అధికా రులు సోమవారం మృతుల వివరాలను ధ్రువీక రించారని తరువాయి 2 వ పేజీలో...



# మాంసపు ముద్దలుగా ఉడికి!

**లక్నో కోచింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం**

**18 మంది విద్యార్థులు అగ్నికి ఆహుతి**

**ఘటనపై సిట్ దర్యాప్తు: యోగి ఆదిత్యనాథ్**

లక్నో: ఉత్తర్ ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో సోమవారం ఒక భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నగరంలోని అత్యంత రద్దీగా ఉండే అలీగంజ్ ప్రాంతంలోని ఓ మూడంతస్తుల వాణిజ్య భవనంలో ఒక్కసారిగా భయంకరమైన మంటలు చెలరేగాయి. అయితే ఈ ఘోర ప్రమాదంలో ఇప్పటి వరకు మొత్తంగా 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో భవనం పైఅంతస్తులో ఉన్న ఒక ప్రముఖ కోచింగ్ సెంటర్‌లో వందలాది మంది విద్యార్థులు క్లాసుల్లో ఉన్నారు. మంటలు వేగంగా వ్యాపించడంతో.. విద్యార్థులు అంతా ప్రాణ భయంతో తరువాయి 2 వ పేజీలో...




## అమెరికాలో తెలుగు యువకుడి మృతి

బిజినేపల్లి-మహబూబ్‌నగర్, జూన్ 22 (ఈవార్తలు): తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సాయి అరుణ్ రెడ్డి (26) ఫ్లోరిడాలో హఠాన్మరణం చెందాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న అతడి మరణ వార్తతో బిజినేపల్లి మండలంలోని అతడి స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,606 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,810 |

## విశ్వవాణి



అల్జీమర్స్ వ్యాధి చికిత్సలో కొత్త ఆశలు రేకెత్తించే పరిశోధనను ఆస్ట్రేలియాలోని మోనాశ్ యూనివర్సిటీ, మెల్‌బోర్న్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. కాపర్ ఆధారిత సమ్మేళనాన్ని ఎలుకలపై పరీక్షించగా, అల్జీమర్స్‌కు కారణమని భావించే అమైలాయిడ్-బీటా ప్రోటీన్ గడ్డలను గణనీయంగా తగ్గించినట్లు గుర్తించారు. ఈ ఔషధం మెదడులోని వ్యర్థాలను తొలగించే పీ-గ్లైకోప్రోటీన్ పంపుల పనితీరును మెరుగుపరచి, హానికర ప్రోటీన్లను బయటకు పంపడంలో సహాయపడింది. చికిత్స పొందిన ఎలుకల్లో అత్యంత విషపూరిత అమైలాయిడ్-బీటా స్థాయిలు 42 శాతం తగ్గగా, వాటి జ్ఞాపకశక్తి, ముఖ్యంగా దిశలను గుర్తుంచుకునే సామర్థ్యం

# మెట్రో-2కు పట్టాలేయండి!

**ఫేస్-2 విస్తరణకు నిధులివ్వండి**

## రైల్వే మంత్రితో సీఎం రేవంత్ విన్నపాలు

**అపాయింట్‌మెంట్ ఇప్పించిన కిషన్ రెడ్డి.. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌తోనూ సీఎం భేటీ**

ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. న్యూఢిల్లీలోని రైల్ భవన్‌లో జరుగుతోన్న ఈ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం హాజరయ్యారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ టేకోవర్, మెట్రో ఫేజ్ 2 విస్తరణ, ఐఆర్‌ఎఫ్‌సీ పెండింగ్ నిధులు గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి మధ్య డైలాగ్ వార్ జరుగుతోన్న వేళ ఈ భేటీకి ప్రాధ్యానం సంతరించుకుంది.



న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 22 (ఈవార్తలు): హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోన్న విషయం తెలిసిందే. ఇరువురు ఒకరిపై ఒకరు విమర్శలు వర్షం కురిపించుకుంటున్నారు. కిషన్ రెడ్డి వల్లే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్ట్ ఆగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించగా.. తన వల్ల తెలంగాణకు రావాల్సిన ఏ ప్రాజెక్ట్ ఆగిపోలేదని కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అయితే, హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్ ఫేజ్ 2 అనుమతులు, పెండింగ్ నిధులపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ అరేంజ్ చేయాలని కిషన్ రెడ్డిని తరువాయి 2 వ పేజీలో...



## నేషనల్ హైవేల వెంట రిపేర్‌షాప్‌లు

న్యూఢిల్లీ : నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) కీలక ఉత్తర్వులు జారీ చేసింది. నేషనల్ హైవేలు, ఎక్స్ ప్రెస్‌వేల వెంబడి వాహనాల రిపేర్, పంక్చర్ షాపులు ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ దాని ఫీల్డ్ ఆఫీస్‌కు ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ హైవేల వెంబడి ఇలాంటి షాపులు చాలా అవసరమని తరువాయి 2 వ పేజీలో...



## పీజీ డిప్లొమా వైద్య కోర్సుల తొలగింపు

న్యూఢిల్లీ: పీజీ డిప్లొమా వైద్య కోర్సుల ప్రవేశాలకు 2026-27 విద్యా సంవత్సరం చివరిదని జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) సోమవారం ఒక పబ్లిక్ నోటీస్‌లో పేర్కొన్నది. ఈ కోర్సులను నిర్వహిస్తున్న కళాశాలలు వాటిని ఎండీ, ఎంఎస్ డిగ్రీ సీట్లుగా మార్చాలని ఆదేశించింది. 2027-28 విద్యా సంవత్సరం నుంచి పీజీ తరువాయి 2 వ పేజీలో...

## ‘కొండల్ రెడ్డి బ్యాంక్’ పెడ్తడేమో!



**ఎస్బీఐ అంశంలో రేవంత్ తీరుపై హరీశ్ ఎద్దేవా**

అచ్చంపేట/హైదరాబాద్, జూన్ 22 (ఈవార్తలు): హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పటి ప్రభుత్వం ఎకరం భూమిచ్చిందని, బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని సీఎం రేవంత్ రెడ్డి అమ్మేశారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐకి ఇచ్చిన భూమిని వేలానికి ఇచ్చిండు.. భూమిని అమ్మేసిండు. అమ్మేస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టుకు వెళ్లింది. మాకు ఎకరం భూమి ఇచ్చిర్రు. ఇది కూడా ఉచితంగా ఏం ఇయ్యలేదు. మేము దాదాపు రూ.20 కోట్లు పెట్టి ఈ భూమి కొనుక్కున్నమని.. ఈ భూమి మా పొజిషన్‌లో ఉన్నది. పైసల్ పెట్టి కొన్న మా తరువాయి 2 వ పేజీలో...

## చిట్టినాయుడుకు సినిమా చూపిస్తా



**వచ్చే ఐదేళ్లు ఏటీ మర్చిపోం**

**కేసీఆర్ అంత మంచోడినైతే కాదు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

వర్ధన్నపేట, జూన్ 22 (ఈవార్తలు): బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డిపైనా పరోక్ష వ్యాఖ్యలు చేశారు. నేను కేసీఆర్ అంత మంచోడిని కాదు. వచ్చే ఐదేళ్ల చిట్టినాయుడు, అండ్ టీం’కు సినిమా చూపిస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. గడిచిన కాలంలో తమను ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరినీ, తమ పార్టీ నేతలపై కక్షపూరితంగా అక్రమ కేసులు బనాయించిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని తరువాయి 2 వ పేజీలో...



## వాట్సాప్ సీఈవోగా కునాల్ షా..!

న్యూయార్క్: మెసేజింగ్ యాప్ వాట్సాప్ గ్లోబల్ సీఈవోగా భారత ఆంత్రోప్రెన్యూర్ కునాల్ షా బాధ్యతలు చేపట్టనున్నాడు. ‘క్రెడ్’ యాప్ వ్యవస్థాపకుడైన కునాల్‌ను తదుపరి సీఈవోగా నియమిస్తున్నట్టు సోమవారం మెటా సంస్థ ప్రకటించింది. 2019 నుంచి సేవలందిస్తున్న విల్ కథ్‌కార్ట్ వారసుడిగా కునాల్ త్వరలోనే తరువాయి 2 వ పేజీలో...

## లారీ ఢీ.. డీటీవో స్పాట్ డెట్

**15 రోజుల క్రితమే ట్రాన్స్‌ఫర్**

**జయశంకర్ జిల్లాలో దారుణం**



భూపాలపల్లి, జూన్ 22 (ఈవార్తలు): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. విధి నిర్వహణలో ఉన్న రవాణా శాఖ అధికారిపైకి లారీ దూసుకెళ్లడంతో ఆయన స్పాట్‌లోని ప్రాణాలు విడిచారు. డీటీవో వెంకన్న .. రోడ్డుపై వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. అటుగా శరవేగంగా దూసుకొచ్చిన లారీ ఒక్కసారిగా ఢీకొట్టి, అతడి పైనుంచి వెళ్లింది. ఈ క్రమంలోనే ఆయనకు తీవ్ర గాయాలు కాగా.. అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఈ ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ శివారులో ఉన్న ఆర్టీవో కార్యాలయం ఎదుట.. సోమవారం ఉదయం పరకాల - భూపాలపల్లి జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతోంది. డీటీఓ తరువాయి 2 వ పేజీలో...

## ఒకే ఇంట్లో నలుగురు మృతి

**కుళ్లిన స్థితిలో మృతదేహాలు.. నల్లగొండ జిల్లాలో విషాదం**

ఒకే ఇంట్లో నాలుగు మృతదేహాలు ఆలస్యంగా బయటపడటం నల్గొండ జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. ఓ ఇంటి నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో ఇరుగు పొరుగున ఉన్న వారికి అనుమానం వచ్చింది. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు చెప్పారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. ఆ ఇంటి డోరు తెరిచి.. పరిశీలించగా.. నాలుగు మృతదేహాలు కనిపించాయి.

నల్లగొండ, జూన్ 22 (ఈవార్తలు): అయితే అవి కుళ్లిపోయిన స్థితిలో కనిపించడంతో.. వారు చనిపోయి కొన్ని రోజులు అవుతోందని తేల్చారు. ఆ నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఏం జరిగిందోననే ఉత్కంఠ నెలకొంది. వారు ఆత్మహత్య చేసుకున్నారా లేక ఎవరైనా కుటుంబాన్ని మొత్తం అంతం చేశారా అనేదానిపై పోలీసులు విచారణ తరువాయి 2 వ పేజీలో...

## బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా



# రాశి ఫలాలు

23.6.2026

మేషం: సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించాలి. దూర ప్రయాణాలు వాయిదా పడుతాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టకపోవడం మంచిది. ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది.

వృషభం: ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో పాత విషయాలు చర్చిస్తారు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆర్థికంగా కొంత ఇబ్బంది తప్పదు. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ పరుస్తాయి. అవసరానికి చేతిలో ధనం నిలువ ఉండదు.

మిధునం: ఆస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆప్తుల నుండి శుభవార్తాలు అందుతాయి. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు లాభిస్తాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. గృహమున కొన్ని ఆశ్చర్యకర విషయాలు తెలుసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో ఒత్తిడులు అదిగమిస్తారు.

కర్కాటకం: దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. అవసరానికి చేతిలో డబ్బు నిలువ ఉండదు. బంధు మిత్రులతో మాట పట్టింపులుంటాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు.

సింహం: విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. సంతాన విద్యా విషయాలు సానుకూల ఫలితానిస్తాయి. ఉద్యోగమున అధికారులతో చర్చలు ఫలిస్తాయి. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ఆర్థిక ప్రణాళికలు రూపొందించుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగుల అంచనాలు నిజం అవుతాయి.

కన్య: దైవ చింతన పెరుగుతుంది. కుటుంబ వాతావరణం చికాకుగా ఉంటుంది. ఉద్యోగమున కొందరి ప్రవర్తన వలన శిరో బాధలు కలుగుతాయి. కొన్ని పనుల్లో ఆటంకాలు తప్పవు. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణాలు చేస్తారు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.

తుల: విలువైన వస్తులాభాలు అందుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి వివాహ ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపార విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక విషయాలలో పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో మీ విలువ పెరుగుతుంది.

వృశ్చికం: ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపిస్తుంది. వ్యాపారాలలో కొంత పురోగతి సాధిస్తారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగాలు లభిస్తాయి. ప్రముఖుల నుంచి అందిన సమాచారం ఊరట కలిగిస్తుంది. ఉద్యోగాలలో బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

ధనస్సు: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణయత్నాలు చేస్తారు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. వ్యాపారాలలో ఒడిదుడుకులు తప్పవు.

మకరం: చేపట్టిన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. దూరప్రయాణాలు శ్రమతో కూడినవిగా ఉంటాయి. బంధు మిత్రులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున పరిస్థితులు అంతంత మాత్రంగా ఉంటాయి.

కుంభం: సంఘంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సంతాన విద్యా విషయాల్లో శుభవార్తలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యల నుంచి తెలివిగా బయటపడతారు. ఆర్థిక లాభాలుంటాయి.

మీనం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. విలువైన వస్తు వాహన లాభాలు అందుకుంటారు. వ్యాపారమున ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.



# ముక్కలు ముక్కలుగా చెదిరి!

**మొదటి పేజీ తరువాయి**

అక్కడి భారత రాయబార కార్యాలయం ఎక్స్‌లో తెలిపింది. "రాస్ లఫాన్ ఘటనలో ఆదివారం రాత్రి 12 మంది భారతీయులు దురదృష్టవశాత్తు మరణించినట్టు ఖతార్ అధికారులు ధ్రువీకరించారు. మృతుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాం" అని రాయబార కార్యాలయం ప్రకటనలో తెలిపింది. కాగా, మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోయారని ఖతార్ ఇంధన మంత్రి సాద్ అల్-కాబీ కూడా సోమవారం మీడియాకు చెప్పారు. గాయపడ్డవారికి వైద్య చికిత్స అందుతోందని, వారిలో ఎవరి ప్రాణాలకూ ప్రమాదం లేదని సాద్ అల్-కాబీ తెలిపారు. మార్చిలో ఖతార్‌పై ఇరాన్ దాడి తర్వాత నిలిపివేసిన కార్యకలాపాలను తిరిగి ప్రారంభిస్తున్న సమయంలో ఈ పేలుడు జరిగిందని, 66 మంది గాయపడ్డారని ఆయన తెలిపారు. ఈ పేలుడు ధాటికి పలు భవనాలు కంపించాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజధాని దోహా ప్రాంతంలో కూడా దీని ప్రభావం కనిపించింది. మరోవైపు దోహాలోని భారత రాయబార కార్యాలయం ఈ సంఘటనపై ఆందోళన వ్యక్తం చేసింది. 'రాస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీలో ఆదివారం జరిగిన దురదృష్టకర ఘటనపై దోహాలోని భారత రాయబార కార్యాలయం తీవ్ర ఆందోళన చెందుతోంది. అధికారుల సమాచారం ప్రకారం ఈ ఘటనలో పలువురు గాయపడగా, మరికొందరు గల్లంతయ్యారు' అని ఒక ప్రకటనలో పేర్కొంది.

# ఫేస్-2 విస్తరణకు.. నిధులివ్వండి

**మొదటి పేజీ తరువాయి**

సీఎం రేవంత్ కోరారు. సీఎం అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన కిషన్ రెడ్డి.. సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ సెట్ చేశారు. ఈ సమావేశంలో ఆయన కూడా పాల్గొన్నారు. ఉప్పు నిప్పులా ఉన్న ఇద్దరు నేతలు ఒకే గదిలో కూర్చొని చర్చించడం గమనార్హం.

## దేవరకద్రలో డీఆర్డీవో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు తెలంగాణ ప్రాజెక్టులు, అంశాలపై చర్చలు జరిపారు. ప్రస్తుతం ఢిల్లీలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి.. మూసీ సుందరీకరణలో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ భూములను బదిలీ చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడం వల్ల ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ ఎయిర్‌పోర్టుకు సహకరిస్తామని కేంద్రమంత్రికి వివరించారు. ఇక ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ టెర్మినల్‌తోపాటు కార్గో, ఎమ్ఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలు కూడా ఆదిలాబాద్‌లో కల్పించాలని తేల్చి చెప్పారు. హ్యాంగర్స్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు అనుకూలంగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర సమీపంలో డిఫెన్స్ నెతీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) ప్రాజెక్ట్ తొందరగా మంజూరు చేయాలని కోరారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యం కోసం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ వంటి సౌకర్యాలను కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్రమంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఇటీవలి కాలంలో మధ్య ఆసియాలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు సరైన ప్రాంతాల కోసం అన్వేషిస్తున్నాయని తెలిపారు. హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైన ప్రాంతమని వివరించారు. ఈ క్రమంలోనే ఆ దిశగా అభివృద్ధి చేయాలని రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్‌అండ్‌బీ ప్రత్యేక సెక్రటరీ వికాస్‌రాజ్.. సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు.. ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్.. స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ ఉన్నారు.

# అమెరికాలో తెలుగు యువకుడి మృతి

**మొదటి పేజీ తరువాయి**

శోకసంద్రంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన సరళ, వెంకట్ రెడ్డి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. బీటెక్ పూర్తవ్వడంతో 2022లో ఫ్లోరిడాకు వెళ్లిన అరుణ్.. అక్కడే జాబ్ చేస్తూ నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తాను నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పద రీతిలో విగతజీవిగా పడి ఉండటంతో.. తోటి స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అరుణ్ గత కొంతకాలంగా థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే, అతడి మృతికి గల పూర్తి కారణాలు మాత్రం ఇంకా తెలియలేదు. సోమవారం అరుణ్ భౌతికకాయానికి పోస్టుమార్టం పూర్తవుతుందని, అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# లారీ ఢీ.. డీటీవో స్పాట్ డెట్

**మొదటి పేజీ తరువాయి**

వెంకన్న తనిఖీలు చేస్తుండగానే.. లారీ ఢీకొట్టడంతో చనిపోయారు. అయితే గతంలో వేరే దగ్గర పనిచేసిన వెంకన్న.. 15 రోజుల క్రితమే బదిలీ మీద భూపాలపల్లికి వచ్చారు. ఈ క్రమంలోనే ఇలాంటి ఘటన జరగడం తీవ్రంగా కలిచివేస్తోంది. వేగంగా వచ్చిన లారీ అతడిపైకి దూసుకెళ్లడంతో డీటీఓ వెంకన్న మృతదేహం నుజ్జు నుజ్జు అయిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు.. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. డీటీఓ వెంకన్న మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి.. లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో తీవ్ర విషాదం నెలకొంది. ఇక లారీ డ్రైవర్‌ను పోలీసులు విచారణ చేయనున్నారు. ఇది ప్రమాదమేనా లేక ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు.. ఈ ఘటనపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డీటీఓ వెంకన్న కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. విధి నిర్వహణలో డీటీఓ వెంకన్న చనిపోవడం తీవ్ర బాధాకరం అని పేర్కొన్నారు. డీటీఓ వెంకన్న కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఇక ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. భూపాలపల్లి డీటీఓ వెంకన్న మృతి పైన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకన్న కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని.. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్‌ను రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

లండన్: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా చేశారు. స్టార్మర్ ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ ప్రకటన వెలువడి 24గంటల్లో కీర్ స్టార్మర్ ప్రధాని పదవికి రాజీనామా చేశారు. 2024లో బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ ప్రధానిగా రాజీనామా చేశారు. కీర్ స్టార్మర్‌తో కలిపి పదేళ్లలో ఆరుగురు ప్రధానులు తమ పదవికి రాజీనామా చేయడం గమనార్హం. రాజీనామాకు ముందు స్టార్మర్ తన భార్యతో కలిసి 10డౌనింగ్ స్ట్రీట్ నుంచి బయటకు వచ్చారు. అక్కడ ఆయన మద్దతు దారులు హర్షధ్వానాలు, చప్పట్లుతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రెండు సంవత్సరాల క్రితం డౌనింగ్ స్ట్రీట్‌లో అడుగుపెట్టిన క్షణాన్ని తన జీవితంలో అత్యంత గర్వించదగిన క్షణంగా కీర్ స్టార్మర్ గుర్తుచేసుకున్నారు. స్టార్మర్ తన రాజకీయ ప్రయాణాన్ని ప్రజల జీవితాలను మార్చాలనే లక్ష్యంతో ప్రారంభించానని పేర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ సాధించిన అఖండ విజయాన్ని గుర్తుచేసుకుంటూ, తన ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన ప్రస్తావించారు. ఆర్థిక వృద్ధి, పెరుగుతున్న వేతనాలు, పెరిగిన పెట్టుబడులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, తగ్గుతున్న ఎన్‌హెచ్‌ఎస్ నిరీక్షణ జాబితాలు, కార్మికులు, అద్దెదారుల హక్కులు, రక్షణ వ్యయం పెరుగుదల వంటి అంశాలను వివరించారు. నేను తీసుకున్న ప్రతి నిర్ణయం తొలి ప్రాధాన్యత దేశానికే. మా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది.

# 'కొండల్ రెడ్డి బ్యాంక్' పెడ్తడేమో!

**మొదటి పేజీ తరువాయి**

భూమి రేవంత్ రెడ్డి ఎట్లా అమ్ముకున్నడు.. అని హైకోర్టుకు పోయారన్నారు. కోర్టు వాళ్లు పైసలు పెట్టి కొన్నది నిజమే కదా ఈ అమ్మకం తప్పు అని స్టే ఇచ్చింది. ఖతం రేవంత్ రెడ్డి ఎస్‌బీఐ మీద పగపట్టిండు. ఎస్‌బీఐని నిషేధిస్తాం. ఎస్‌బీఐలో ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లు బయటకు తీసేస్తాం. ఎస్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే ఖాతాలన్ని తీసేస్తా.. అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా బ్లాక్ మెయిల్ చేస్తుండు.. రేవంత్ రెడ్డి తీరు ఎవరన్నా ప్రశ్నిస్తే పగబట్టమన్నట్టు ఉంది. ఇవాళ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే నిషేధిస్తా అంటున్నడు.. రేపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరల్డ్ బ్యాంక్ కూడా నీ మాట వినలేదనుకో దాన్ని కూడా నిషేధిస్తా అంటాడు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక ఒక బ్యాంక్ అయితే కావాలి కదా.. ఎవరు నీకు వ్యతిరేకంగా మాట్లాడితే ఆ బ్యాంక్‌నే నిషేధిస్తా అంటే మరి ఏం చేస్తడు.. నాకో డౌటు..కొత్తగా కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెడ్తడో ఏమో.. పెట్టినా పెడ్తడు మస్త్ జమ అయినయ్ పైసలు. రేపు ఎనుముల కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెట్టినా పెడ్తారని ఎద్దేవా చేశారు.

# మాంసపు ముద్దలుగా ఉడికి!

**మొదటి పేజీ తరువాయి**

అల్లల్లాడిపోయారు. దట్టమైన పొగలు భవనాన్ని కమ్మేయడంతో ఊపిరాడక, బయటకు వచ్చే దారి లేక పలువురు అభ్యర్థులు తమ ప్రాణాలను కాపాడుకునేందుకు భవనం పైఅంతస్తుల కిటికీల నుంచి కిందకు దూకారు. స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. అలీగంజ్ పరిధిలోని సదరు మూడంతస్తుల భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో తొలుత ప్రమాదవశాత్తు మంటలు ప్రారంభం అయ్యాయి. అక్కడ మంటలు అంటుకున్న కొద్ది సేపటికే.. అవి అత్యంత వేగంగా పైఅంతస్తుల్లో ఉన్న కోచింగ్ సెంటర్‌కు, వాణిజ్య సంస్థలకు ఎగబాకాయి. క్షణాల వ్యవధిలోనే భవనం అంతా నిప్పుల కొలిమిలా మారిపోయింది. కాంప్లెక్స్ మొత్తం దట్టమైన నల్లటి పొగలు అలముకోవడంతో లోపల ఉన్న విద్యార్థులకు ఏమీ కనిపించలేదు. కిందకు దిగే మెట్ల మార్గం కూడా మంటల్లో చిక్కుకుపోవడంతో.. క్లాసు రూముల్లో ఉన్న అభ్యర్థులు తీవ్ర భయాందోళనల మధ్య కేకలు వేశారు.

ఎలాగైనా సరే ప్రాణాలు దక్కించుకోవాలనుకుని.. కొందరు సాహసించి కిటికీల నుంచి కిందికి దూకేశారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది భారీగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేసేందుకు, లోపల చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకు వచ్చేందుకు రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. భవనమంతా పొగతో నిండిపోవడంతో రెస్క్యూ సిబ్బందికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. అయితే ఇప్పటి వరకు మొత్తంగా 18 మంది ప్రాణాలు కోల్పోగా.. చాలా మంది గాయపడినట్లు సమాచారం. కిందకు దూకిన విద్యార్థులకు, పొగ కారణంగా అస్వస్థతకు గురైన వారికి స్థానిక ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. భవనంలో సరైన అగ్నిమాపక రక్షణ ఏర్పాట్లు ఉన్నాయా లేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## హైవేల వెంట రిపేర్‌షాప్‌లు

**మొదటి పేజీ తరువాయి**

పేర్కొన్నది. హైవేలపై ప్రయాణించేటప్పుడు వాహనాల్లో రిపేర్ సమస్యలు లేదా పంక్చర్ లాంటివి జరిగినప్పుడు ఈ షాపు లు ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని స్పష్టం చేసింది. నేషనల్ హైవే లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్రస్తుతం పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో లీజు ప్రాతిపదికన హైవే సౌకర్యాల నెట్‌వర్క్‌ను డెవలప్ చేస్తున్నది.

## పీజీ డిప్లొమా వైద్య కోర్సుల తొలగింపు

**మొదటి పేజీ తరువాయి**

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలను అనుమతించబోమని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న కోర్సులను ఆ తర్వాత నిలిపివేస్తామని తెలిపింది. చాలా కళాశాలలు ఒకే స్పెషాలిటీలో డిప్లొమా, డిగ్రీ కోర్సులను నిర్వహిస్తున్నాయని.. ఇందులో చాలా కళాశాలలు డిప్లొమా సీట్లను ఎండీ లేదా ఎంఎస్ డిగ్రీ సీట్లుగా మార్చుకోవడానికి అవసరమైన అన్ని సదుపాయాలను కలిగి ఉన్నాయని తాము నమ్ముతున్నట్టు తెలిపింది. డిప్లొమా సీట్లను డిగ్రీ సీట్లుగా మార్చుకోవాలనుకొంటున్న కళాశాలలు వైద్య మదింపు, రేటింగ్ బోర్డ్‌కు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ప్రస్తుత విద్యా ప్రమాణాలకు అనుగుణంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యను ప్రామాణీకరించాలనే లక్ష్యంతో, ప్రత్యేక శిక్షణ గుర్తింపును మెరుగు పరిచేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నామని కమిషన్ తెలిపింది.

## వాట్సాప్ సీఈవోగా కునాల్ షా..!

**మొదటి పేజీ తరువాయి**

వాట్సాప్ పగ్గాలు అందుకోనున్నాడు. ఆంత్రోప్రెన్యూర్‌గా విజయవంతమైన, సాంకేతికగ అనుభవం కలిగిన కునాల్ అసవరం వాట్సాప్ యాప్‌కి ఎంతో ఉందని మెటా భావించింది. కునాల్ టెక్నికల్ నాలెడ్జ్‌ని మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మెచ్చుకున్నారు కూడా. అందుకే.. అన్ని విధాలా సమర్ధుడైన కునాల్‌ను తదుపరి గ్లోబల్ సీఈఓగా నియమించింది. వాట్సాప్ తుదపరి నాయకుడిగా కునాల్ షా మెటాలో భాగమవ్వనున్నాడు. భారత దేశంలో ముఖ్యమైన సాంకేతిక కంపెనీగా క్రెడ్‌ను అతడు తీర్చిదిద్దాడు. సాంకేతిక నైపుణ్యం, యూజర్ల నాడీ బాగా తెలిసిన కునాల్.. ప్రపంచంలోనే పెద్దదైన మెసేజింగ్ యాప్‌ను మరింత మెరుగ్గా నడుపనున్నాడు.

## ఒకే ఇంట్లో నలుగురు మృతిల

**మొదటి పేజీ తరువాయి**

జరుపుతున్నారు. నల్లగొండ సాగర్ రోడ్డులో ఉన్న తెలంగాణ కాలనీలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు గురి చేస్తోంది. ఒకే ఇంట్లో నాలుగు మృతదేహాలు కనిపించాయి. అయితే వారు 4 రోజుల క్రితమే చనిపోయి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ నలుగురిలో ఇద్దరు భార్యాభర్తలు అని పోలీసులు గుర్తించారు. వారు ఎండీ సుల్తాన్ ఆయన భార్య హసీనా అని తేల్చారు. అయితే మరో ఇద్దరు ఎవరు అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మిగితా ఇద్దరు సుల్తాన్, హసీనా దంపతుల పిల్లలు అని అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే మృతదేహాలను గుర్తించేందుకు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో కలిసి పోలీసులు రంగంలోకి దిగారు. సంఘటనా స్థలంలో దొరికిన సాక్ష్యాధారాలను బట్టి.. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నల్లగొండలోని ప్రకాశం బజార్‌లో ఎండీ సుల్తాన్ బ్యాగుల వ్యాపారం చేస్తుంటాడని.. ఇక ఆయన భార్య హసీనా స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోందని స్థానికులు వెల్లడించారు. అయితే వారు ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.


## సినిమా చూపిస్తా

**మొదటి పేజీ తరువాయి**


కేటీఆర్ హెచ్చరించారు. కష్టకాలంలో పార్టీతో కలిసి నడిచిన ప్రతి ఒక్క కార్యకర్తను, నాయకుడిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్షాలను అణచివేయాలని చూస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ శ్రేణులు మరింత దూకుడుగా ప్రజల్లోకి వెళ్తాయని పిలుపునిచ్చారు. ఈ రాజకీయ యుద్ధంలో తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ప్రతి అక్రమ కేసును చట్టపరంగా మరియు రాజకీయంగా ఎదుర్కొంటామని కేటీఆర్ పునరుద్ఘాటించారు. కేవలం డైవర్షన్ పాలిటిక్స్ కోసమే ప్రభుత్వం తమపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కుతంత్రాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ప్రతిపక్షంగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామని, అధికార పక్షానికి చుక్కలు చూపిస్తామని కేటీఆర్ సవాల్ విసిరారు.

# లిక్కర్ కింగ్‌లు.. సిగరెట్ క్వీన్లు

**మద్యపాన సేవనంలో తగ్గేదేలే అంటున్న పురుషులు.. పొగతో రింగులు తెప్పిస్తామంటున్న మహిళామణులు.. ఆరోగ్య సర్వేలో పలు ఆందోళనకర విషయాలు**



న్యూఢిల్లీ: దేశంలో ప్రజారోగ్య ముఖచిత్రంపై జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6, 2023-24) ఆందోళనకర గణాంకాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా పురుషుల్లో మద్యపానం, పలు రాష్ట్రాల్లో మహిళల్లో పొగాకు వినియోగం పెరిగినట్లు ఈ సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పురుషుల మద్యం వినియోగం పెరగడం గమనార్హం. జాతీయ స్థాయిలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో మద్యపాన అలవాటు ఉన్నవారి సంఖ్య 18.7 శాతం నుంచి 18.9 శాతానికి స్వల్పంగా పెరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, కేరళ, పంజాబ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ పెరుగుదల స్పష్టంగా కనిపించింది. మద్యపాన నిషేధం అమల్లో ఉన్న బీహార్‌లో సైతం పురుషుల మద్యం వినియోగం 15.4 శాతం నుంచి 16.5 శాతానికి పెరగడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ శాతం 23.1 నుంచి 23.3కు, తెలంగాణలో 43.4 నుంచి 43.9 శాతానికి చేరింది. దేశవ్యాప్తంగా మహిళల్లో మద్యపానం అలవాటు 1.3 శాతం నుంచి 1.1 శాతానికి తగ్గింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో (0.5 నుంచి 0.6 శాతం), తెలంగాణలో (6.7 నుంచి 7.1 శాతం) మహిళా మద్యపాన ప్రియుల సంఖ్య పెరిగింది. గుజరాత్‌లో మహిళలు, పురుషుల్లో మద్యం సేవించే వారి సగటు 5.8 శాతం నుంచి 5.2 శాతానికి తగ్గింది. మరోవైపు, దేశవ్యాప్తంగా మహిళల్లో పొగాకు వినియోగం 8.9 శాతం నుంచి 8.4 శాతానికి స్వల్పంగా తగ్గింది. అయినప్పటికీ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా 13 రాష్ట్రాల్లో మహిళలు పొగాకును ఎక్కువగా వినియోగిస్తున్నట్లు నివేదిక తేలింది. పురుషుల్లో పొగాకు వినియోగం 38 శాతం నుంచి 36.3 శాతానికి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటం, ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల పొగాకు, మద్యం వాడకం ఎక్కువగా ఉన్నట్లు నివేదిక విశ్లేషించింది. ఈ గణాంకాలపై ఐసీఎంఆర్-ఎన్ఐసీపీఆర్ డైరెక్టర్ డాక్టర్ షాలిని సింగ్ స్పందించారు. "జాతీయ సగటులు సంతృప్తికరంగా ఉన్నట్లు అనిపించినా, పలు రాష్ట్రాల్లో సమస్య తీవ్రంగా ఉంది. అందువల్ల ప్రతి రాష్ట్రం, జిల్లాకు ప్రత్యేకమైన కార్యాచరణ అవసరం" అని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా గర్భిణుల్లో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో కౌన్సెలింగ్ సేవలను విస్తృతం చేయాలని ఆమె సూచించారు. క్యాన్సర్, గుండె జబ్బుల వంటి అసంక్రమిత వ్యాధులు పెరగడానికి ఈ వ్యసనాలే ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## చికున్ గున్యాకు విరుగుడు గోమూత్రం

**ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల పరిశోధన.. గోమూత్ర అర్కానికి యాంటీవైరల్ గుణాలు.. వైరల్ లోడ్‌ను 99% వరకు తగ్గించే శక్తి**

న్యూఢిల్లీ: చికున్ గున్యా వంటి వ్యాధులు తరచూ విజృంభిస్తున్న నేపథ్యంలో వైరల్ ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనేందుకు శాస్త్రవేత్తలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం చికున్ గున్యాకు నిర్దిష్టమైన యాంటీవైరల్ మందు అందుబాటులో లేదు. ఈ క్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) రూర్కీ పరిశోధకులు జరిపిన ఒక అధ్యయనం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఆయుర్వేదంలో ఉపయోగించే గోమూత్ర అర్కానికి చికున్ గున్యా వైరస్‌ను ఎదుర్కొనే శక్తిమంతమైన సామర్థ్యం ఉందని వారి ప్రయోగశాల అధ్యయనంలో తేలింది. ఐఐటీ రూర్కీలోని బయోసైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ షైలీ తోమర్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన నిర్వహించింది. ప్రయోగశాలలో నియంత్రిత వాతావరణంలో జరిపిన పరీక్షల్లో గోమూత్ర అర్కం.. చికున్ గున్యా వైరల్ లోడ్‌ను 90 శాతానికి పైగా తగ్గించినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. అంతేకాకుండా, సహజసిద్ధమైన బయోయాక్టివ్ సమ్మేళనాలతో రూపొందించిన ఒక ప్రత్యేక ఫార్ములేషన్.. వైరల్ లోడ్‌ను ఏకంగా 99.85 శాతం వరకు తగ్గించడం గమనార్హం. గోమూత్రంలోని కొన్ని బయోయాక్టివ్ సమ్మేళనాలు ఈ యాంటీవైరల్ చర్యకు కారణమై ఉండవచ్చని వారు అంచనా వేస్తున్నారు. ఈ అధ్యయన వివరాలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సైన్స్ జర్నల్ 'ఏసీఎస్ అగ్రికల్చరల్ సైన్స్ & టెక్నాలజీ'లో ప్రచురితమయ్యాయి. ఏడెస్ జాతి దోమల కాటు ద్వారా వ్యాపించే చికున్ గున్యా.. తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు, తలనొప్పి, కండరాల నొప్పులు, అలసట వంటి లక్షణాలతో బాధితులను తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. చాలా మంది కోలుకున్నప్పటికీ, కొందరిలో కీళ్ల నొప్పులు నెలలు, లేదా సంవత్సరాల పాటు కొనసాగుతాయి. ప్రస్తుతం ఈ వ్యాధికి నిర్దిష్ట మందులు లేకపోవడంతో కేవలం లక్షణాల తీవ్రతను తగ్గించేందుకే చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సహజసిద్ధమైన సమ్మేళనాలలో యాంటీవైరల్ గుణాలను గుర్తించడం ద్వారా భవిష్యత్తులో కొత్త మందుల అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే, ఈ అధ్యయన ఫలితాలను చూసి చికున్ గున్యా చికిత్స కోసం ప్రజలు నేరుగా గోమూత్రాన్ని వాడకూడదని శాస్త్రవేత్తలు గట్టిగా హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం ప్రయోగశాలలో కణాలపై జరిపిన అధ్యయనం మాత్రమేనని, మానవులపై దీని ప్రభావాన్ని పరీక్షించలేదని స్పష్టం చేశారు.



## కేతావత్ రామకృష్ణకు అరుదైన గౌరవం

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ సమాఖ్య తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం**

శ్రీనగర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేతావత్ రామకృష్ణను నియమించినట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ ఉదిత్ రాజ్ (మాజీ ఐఆర్ఎస్ అధికారి) ప్రకటించారు. జమ్మూ కశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సులో ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. దేశంలోని 21 రాష్ట్రాల అధ్యక్షులు, ప్రతినిధుల సమక్షంలో డాక్టర్ ఉదిత్ రాజ్ రామకృష్ణకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉదిత్ రాజ్ మాట్లాడుతూ తెలంగాణలో భారత రాజ్యాంగ విలువల వ్యాప్తితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీస్ వర్గాల అభ్యున్నతి కోసం కేతావత్ రామకృష్ణ సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ డివిజన్ ఆర్డీవోగా, డిప్యూటీ కలెక్టర్ల సంఘం జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామకృష్ణ, తెలంగాణ ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కులు, భారత రాజ్యాంగ ప్రచారం కోసం గత కొన్ని సంవత్సరాలుగా కృషి చేస్తున్న విషయం తెలిసిందే. నియామకం సందర్భంగా డాక్టర్ ఉదిత్ రాజ్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్ రాజ్‌కు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంస్థ బలోపేతం, రాజ్యాంగ విలువల ప్రచారం, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని రామకృష్ణ పేర్కొన్నారు.



## చిరంజీవితో టీబీజేపీ చీఫ్ భేటీ

**కేంద్ర ప్రభుత్వ స్పెషల్ బుక్, బ్రోచర్ల అందజేత.. మర్యాదపూర్వక భేటీ మాత్రమేనన్న బీజేపీ వర్గాలు**

హైదరాబాద్, జూన్ 22 (ఈవార్తలు): టాలీవుడ్ అగ్ర కథానాయకుడు, మెగాస్టార్ చిరంజీవిని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు కలిశారు. చిరంజీవి నివాసానికి వెళ్లిన రాంచందర్ రావు... ఆయనతో భేటీ అయ్యారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం విజయవంతంగా 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక 'మహా జన్ సంపర్క్ అభియాన్' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సమాజంలోని వివిధ రంగాల ప్రముఖులను కలిసి మోదీ ప్రభుత్వ విజయాలను వివరిస్తున్నారు. ఈ క్రమంలోనే రామచందర్ రావు.. మెగాస్టార్‌ను కలిసి కేంద్ర ప్రభుత్వ ప్రగతికి సంబంధించిన ఒక స్పెషల్ బుక్, బ్రోచర్లను అందజేశారు. దాదాపు అరగంటకు పైగా సాగిన ఈ సమావేశంలో దేశ ఆర్థిక పురోగతి, సాంస్కృతిక పునరుజ్జీవనం, వినోద రంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిణామాలపై ఇరు ప్రముఖుల మధ్య ఆసక్తికర చర్చ సాగినట్లు సమాచారం. అయితే ఈ భేటీ కేవలం మర్యాదపూర్వకమైనదేనని, ప్రభుత్వ 12 ఏళ్ల విజయాల బుక్‌లెట్‌ను అందించడానికే కలిశామని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ నేతలు దీనిని క్యాజువల్ మీటింగ్ అంటున్నప్పటికీ, సోషల్ మీడియా నెటిజన్లు మాత్రం ఊరుకోవడం లేదు. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసి, ప్రస్తుతం యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉంటున్న చిరంజీవి.. కాషాయ తీర్థం పుచ్చుకుని సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేస్తారా? అనే చర్చ మొదలైంది. ఆయన సోదరుడు, జనసేనాని పవన్ కల్యాణ్ ఇప్పటికే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా కొనసాగుతుండగా... మెగాస్టార్ బీజేపీ వైపు మొగ్గు చూపే ఛాన్స్ ఉందా? అంటూ విశ్లేషణలు గుప్పుమంటున్నాయి.

## కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా: మహేశ్ కుమార్ గౌడ్

వరంగల్, జూన్ 22 (ఈవార్తలు): తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ 100 స్థానాల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్ల దొంగతనంతో పాటు సీట్ల దొంగతనానికి కూడా బీజేపీ పాల్పడుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకున్నారో ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రస్తుతం సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే లక్ష్యంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు.

## రేవంత్‌వి డైవర్షన్ డ్రామాలు

**మెట్రో అవినీతికి భయపడే ఇదంతా**

**బీజేపీ ఎంపీ రఘునందన్ రావు**

హైదరాబాద్, జూన్ 22 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ పొలిటికల్ వార్ నెక్స్ట్ లెవెల్‌కు చేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను, తప్పులను కప్పిపుచ్చుకోవడానికే కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 టేకోవర్ వ్యవహారంలో తెరవెనుక భారీ ఎత్తున అవకతవకలు, అవినీతి జరిగాయని రఘునందన్ రావు సంచలన ఆరోపణ చేశారు. వీటిపై ఎక్కడ విచారణ జరిగి తనపై కేసులు ఫైల్ అవుతాయో అనే భయంతోనే... సీఎం రేవంత్ రెడ్డి కావాలనే కేంద్రంపై అభాండాలు వేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. మెట్రో ఫేజ్-2 పనులను కేంద్ర ప్రభుత్వం తొక్కిపెడుతోందన్న కాంగ్రెస్ ఆరోపణలను ఎంపీ పూర్తిగా కొట్టేశారు. "రాష్ట్రానికి ఐఆర్ఎఫ్‌సీ నుంచి వచ్చిన భారీ రుణం ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ గ్యారెంటీ (పూచీకత్తు) వల్లే సాధ్యమైంది. కేంద్రమే అంతగా సపోర్ట్ చేస్తున్నప్పుడు, మెట్రో ఫేజ్-2 పనులను మోదీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటుంది?" అని తెలంగాణ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ పాలన తీరును రఘునందన్ రావు తనదైన శైలిలో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గవర్నెన్స్ 'సుతి లేని సంసారం' లాగా తయారైందని ఫైర్ అయ్యారు. సొంత క్యాబినెట్ మంత్రులే ముఖ్యమంత్రి మాటలను అస్సలు ఖాతరు చేయడం లేదని, అందుకే రేవంత్ రెడ్డి తీవ్రమైన ఫ్రస్టేషన్‌లోకి వెళ్లిపోయి కేంద్రంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## ప్రకాశ్ రాజ్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్

**4 రాష్ట్రాల్లో ఓటు హక్కుపై బెంగళూరు కోర్టు సీరియస్**

బెంగళూరు: నటుడు ప్రకాశ్ రాజ్ చుట్టూ వివాదం నెలకుంది. ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓటరు గుర్తింపు కార్డులు ఉండకూడదనే ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారనే కేసులో ఆయనకు గట్టి షాక్ తగిలింది. బెంగళూరులోని 48వ ఏసీజేఎం కోర్టు శనివారం ప్రకాశ్ రాజ్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ సంచలన ఆదేశాలు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే... ప్రకాశ్ రాజ్‌కు ఒకే సమయంలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఓటరు గుర్తింపు కార్డులు ఉన్నాయంటూ 2019లో దిలీప్ కుమార్ అనే న్యాయవాది బెంగళూరు హలసూరు గేట్ పోలీస్ స్టేషన్‌లో తొలిసారి ఫిర్యాదు చేశారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయనకు ఓటు హక్కు ఉందని, ఇది ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చట్టవిరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ అక్రమ ఓట్ల వ్యవహారంపై బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) అధికారులకు, కేంద్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సదరు న్యాయవాది ఏకంగా కోర్టును ఆశ్రయించారు. ఈ ప్రైవేట్ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం గత కొన్ని విచారణలుగా కోర్టుకు స్వయంగా హాజరుకావాలంటూ ప్రకాశ్ రాజ్‌కు సమన్లు జారీ చేసింది. అయితే, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రకాశ్ రాజ్ వరుసగా కోర్టు విచారణలకు గైర్హాజరవుతూ వచ్చారు. కోర్టు సమన్లను లైట్ తీసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి... ఈసారి ఆయనకు ఎలాంటి బెయిల్ దొరకకుండా నేరుగా నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇష్యూ చేశారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఉలమా-హుఫ్ఫాజ్ సంఘం పునర్నిర్మాణం



**మౌలానా అబ్దుల్ మాజిద్ నద్వీ అధ్యక్షుడిగా ఎంపిక**

జగిత్యాల టౌన్, జూన్ 22 (ఈవార్తలు): జగిత్యాల ఉలమా, హుఫ్ఫాజ్ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఇషా నమాజ్ అనంతరం మస్జిద్-ఎ-జహ్రాలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సంఘం జనరల్ సెక్రటరీ హాఫిజ్ అన్సార్ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం, ఉలమాలు, హుఫ్ఫాజ్‌లు, ప్రము ఖులు పాల్గొన్న ఈ సమావేశం ముఫ్తీ, ఖారీ మహ మ్మద్ ఖలీలుద్దీన్ అల్ హసనీ ఖురాన్ పఠనంతో ప్రారంభమైంది. సమావేశంలో మౌలానా మహమ్మద్ అబ్దుల్ మాజిద్ నద్వీని అధ్యక్షుడిగా, హాఫిజ్ అన్సార్ ఖాన్‌ను జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇతర పదవులకు సంబంధించిన నియామకా లను కూడా ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం పర్యవేక్షణ కోసం మజ్లిస్-ఎ-షూరాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మత, సామాజిక, సేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఫ్తీ మహమ్మద్ సిద్దీఖ్, ముఫ్తీ మహమ్మద్ ఖలీలుద్దీన్, ముఫ్తీ మహమ్మద్ ఫుర్ఖానుద్దీన్, ముఫ్తీ నౌషాద్ అలీ, ముఫ్తీ యూనస్ ఖాన్, మౌలానా అబ్దుల్ రహ్మాన్, మౌలానా ఉబైదుర్ రహ్మాన్, హాఫిజ్ సయ్యద్ షమ్సుద్దీన్ తబ్రేజ్, హాఫిజ్ ఖ్వాజా అఖీలుద్దీన్, హాఫిజ్ ఖాజీ అజ్మల్, హాఫిజ్ జహూర్, హాఫిజ్ జఫర్, హాఫిజ్ ఖ్వాజా ఇమ్రాన్, హాఫిజ్ ఆమిర్, హాఫిజ్ ఉమర్ ఖాన్, హాఫిజ్ సమీరుద్దీన్, హాఫిజ్ మహమ్మద్ సలీముద్దీన్, హాఫిజ్ అబ్దుల్ ఖాలిఖ్, హాఫిజ్ షేక్ ఉమర్, హాఫిజ్ రిజ్వాన్ అల్లాహ్ బేగ్, హాఫిజ్ మజ్హర్, హాఫిజ్ ఖ్వాజా షుఐబ్, హాఫిజ్ హుజైఫ్, హాఫిజ్ ముదస్సిర్, హాఫిజ్ నవీద్ తదితరులు పాల్గొన్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఘనంగా పోలీస్ డ్యూటీ మీట్ ప్రారంభం

జగిత్యాల, జూన్ 22 (ఈవార్తలు): పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యాలు అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి 3వ పోలీసు డ్యూటీ మీట్-2026 కార్యక్రమాన్ని ఆయన అదనపు ఎస్పీ చేతన్ నితిన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో అధికారులు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, సైబర్ క్రైమ్ విచారణలో ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరమని తెలిపారు. పోలీసు శాఖలో ప్రతి అధికారి చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ఆయన పేర్కొన్నారు. శాస్త్రీయ ఆధారాలతో నేరాలను నిరూపించే సామర్థ్యం పెంపొందించుకోవాలని సూచించారు. డ్యూటీ మీట్ ద్వారా అధికారులు, సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు అనుభవాలు, కొత్త ఆలోచనలను పరస్పరం పంచుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్ అవగాహన, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి జోనల్, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్‌తో పాటు డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## షిండే వర్గంలోకి ఆరుగురు ఎంపీలు

**ఉద్ధవ్ థాకరేకు భారీ షాక్.. ఆపరేషన్ టైగర్ విజయవంతం: షిండే**

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరేకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు లోక్‌సభ ఎంపీలు సోమవారం ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గంలో చేరారు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి షిండే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ పరిణామంతో 2022 నాటి చీలిక తర్వాత ఉద్ధవ్ పార్టీలో సంక్షోభం మరింత ముదిరినట్లయింది. షిండే వర్గంలో చేరిన వారిలో ఓంప్రకాశ్ భూపాల్‌సిన్హ, నగేష్ బాపురావ్ పాటిల్ అష్టికర్, సంజయ్ హరిబావ్ జాదవ్, సంజయ్ ఉత్తమ్ రావ్ దేశ్‌ముఖ్, భావుసాహెబ్ రాజారామ్ వక్చౌరే, సంజయ్ దీనా పాటిల్ ఉన్నారు. వీరి చేరికతో లోక్‌సభలో యూబీటీ బలం 9 నుంచి 3కు పడిపోగా, షిండే వర్గం బలం 7 నుంచి 13కు పెరిగింది. మొత్తం 9 మంది ఎంపీల్లో ఆరుగురు (మూడింట రెండొంతుల మంది) పార్టీ మారడంతో, ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వీరు అనర్హత వేటు నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. తాము పార్టీ మారడానికి గల కారణాలను అసమ్మతి ఎంపీలు వివరించారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. శివసేన (యూబీటీ)లోని సీనియర్ నేతల నుంచి తాము విమర్శలు ఎదుర్కొన్నామని నగేష్ అష్టికర్ వెల్లడించారు. తన కుటుంబానికి సంబంధించిన కోర్టు కేసు విషయంలో షిండే, ఫడ్నవీస్ ద్వారా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చర్చలు జరిగాయని ఓంరాజే నింబాల్కర్ తెలిపారు. ఈ చేరికలపై ఏక్‌నాథ్ షిండే స్పందిస్తూ, "ఆపరేషన్ టైగర్ విజయవంతంగా పూర్తయింది" అని ప్రకటించారు. ఈ పరిణామాలపై ఉద్ధవ్ థాకరే తీవ్రంగా స్పందించారు. ఎన్నికల తర్వాత తమ ఎంపీలు అమ్ముడుపోయారని ఆయన ఆరోపించారు.


VANGS
GLOBAL TECHNOLOGIES LLP
POWERING
NEWS
DIGITALLY
Smart CMS & Digital Solutions
for Modern News Businesses
DAILY NEWS
Global economy shows signs of recovery
NEWS
Global Economy Shows Signs of Recovery
1 News Paper CMS
Manage, publish & distribute newspapers efficiently with our powerful CMS.
2 News Website CMS
Create dynamic, fast & SEO-friendly news websites with ease.
3 Mobile App Development
Engage your audience on the go with feature-rich news mobile apps.
Fast & Reliable
Secure & Scalable
Responsive Design
Easy to Use & Manage
VANGS GLOBAL TECHNOLOGIES
Contact: +91 76750 87378
News Paper CMS
News Website CMS
Mobile App Development



# నీ–నా చుట్టమైతే గుట్టమీదికి!

## కొన్ని వాహనాలకు గుడి దగ్గరదాకా అనుమతి

**సాధారణ భక్తులకు మాత్రం కాలినడకే దిక్కు.. కొండగట్టు గుట్టపై తీరొక్క నిబంధన**

మల్యాల, జూన్ 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో కొండపై పంపే వాహనాల విషయంలో వివక్ష చూపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సాధారణంగా ఈవో కార్యాలయం ముందు బారికేడ్లు పెట్టి వాహనాలను పైకి అనుమతించడం లేదు. అదే.. తెలిసినవాళ్లో, దగ్గరి బంధువులో వస్తే.. బారికేడ్లు తెరిచి.. గుడి వరకు వాహనాలను అనుమతి ఇస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధుల కోసం ఉచిత ఈ–ఆటో సదుపాయం ఉంది. అయినా, కొందరు తమ పరపతిని వాడుకొని గుట్ట మీది వరకు వాహనాలను తీసుకెళ్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ భక్తులకు ఓ తీరు, వీఐపీలకు మరో తీరు అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల అనుమతుల విషయంలో అధికారులు పారదర్శకతను పాటించాలని, అందరికీ ఒకే నిబంధన అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికోసం స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటించాలని కోరుతున్నారు.



# రూ.10 ఇస్తేనే కొబ్బరికాయ కొట్టరు!

**కొబ్బరి నీళ్లు కావాలంటే వంద కొట్టాల్సిందే.. కొండగట్టు అంజన్న గుడిలో వసూళ్ల దందా**

మల్యాల, జూన్ 22 (ఈవార్తలు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులు అధిక వసూళ్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో కొబ్బరికాయ కొట్టేందుకు ఒక్కొక్క దానికి రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారని, అలాగే ఆలయ పరిసరాల్లో ఒక లీటర్ కొబ్బరి నీటిని రూ.100కు విక్రయిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి భక్తి భావంతో వచ్చే ప్రజలపై ఈ అదనపు భారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాల కంటే వసూళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వసూళ్లు అధికారికంగా నిర్ణయించినవేనా? కొబ్బరి నీటి ధరలపై ఎలాంటి నియంత్రణ ఉందా? అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. అలాగే ఆలయ పరిసరాల్లో జరుగుతున్న ధరల దోపిడీపై అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# అంగన్వాడీ చిన్నారులకు యూనిఫాంల పంపిణీ

**కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్**

జగిత్యాల టౌన్, జూన్ 22 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని ముస్లిం కమిటీ హాల్‌లో వార్డులు 16, 17, 34, 35 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫాంలను అందజేసిన ఎమ్మెల్యే, వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. చిన్నారులకు మెరుగైన విద్యా, సంక్షేమ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యురాలు తస్లీమ్ సుల్తానా ముజీబుద్దీన్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఖాజా కమాలుద్దీన్, 17వ వార్డు కౌన్సిలర్ అయూబ్ ఖాన్, 16వ వార్డు కౌన్సిలర్ దూమాల రాజ్‌కుమార్, 34వ వార్డు కౌన్సిలర్, ప్రాజెక్టు చైర్మన్ భాస్కర్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రణాళికలతోనే ఉత్తమ ఫలితాలు

## ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్.. జగిత్యాల జిల్లాలో విస్తృత పర్యటన



కొడిమ్యాల, మల్యాల, జగిత్యాల బ్యూరో, జూన్ 22 (ఈవార్తలు): లక్ష్యంతో కూడిన ప్రణాళికలు రూపొందించి ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం కింద ఆమె జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి సోమవారం జగిత్యాల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలోని పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరును పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన సిక్తా పట్నాయక్ పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాబోయే పరీక్షలకు ఇప్పటి నుంచే లక్ష్యంతో కూడిన ప్రణాళిక రూపొందించుకుని కష్టపడి చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టుదలతో శ్రమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, కోడిగుడ్ల సరఫరా తదితర అంశాలపై జిల్లా విద్యాశాఖాధికారి, ప్రధానోపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం డైనింగ్ హాల్, వంటశాలను పరిశీలించి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే అమలు చేయాలని, పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కిచెన్ గార్డెన్ నిర్వహణపై కూడా దృష్టి పెట్టాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం కొడిమ్యాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది పనితీరును పరిశీలించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తదుపరి మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సహకారంతో అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేరుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము, డిపిఓ మదన్మోహన్, తహసీల్దార్, ఎంపీడీవో, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణాభివృద్ధికి అధిక నిధులు: అడ్లూరి

పెగడపల్లి, జూన్ 22 (ఈవార్తలు): ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి ప్రజల అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన 68 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు, 9 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించినందుకు సేవ చేయడం తన బాధ్యత అని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. అర్హులైన నిరుపేదలకు జూలై నెల నాటికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల అభివృద్ధికి పెగడపల్లి మండలానికి రూ.2.51 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టి మెరుగైన వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే సాగునీరు చివరి ఆయకట్టు వరకు అందేలా చర్యలు తీసుకుంటామని, రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. పెగడపల్లి మండలాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



# నడిబొడ్డున పెట్రోల్ బంక్ వద్దు

**అనుమతులు రద్దు చేయాలి.. బీజేపీ నాయకుల డిమాండ్**

జగిత్యాల, జూన్ 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాతన తహసీల్దార్ కార్యాలయ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు సిపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ నాయకులు లింగంపేట శ్రీనివాస్, బిట్టు, ఎర్ర శ్రీనివాస్‌లతో కలిసి పాత తహసీల్దార్ కార్యాలయ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా నడిబొడ్డున ఉన్న విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఓ ప్రముఖ కంపెనీకి పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం లీజుకు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ స్థలాన్ని పెట్రోల్ బంక్‌కు కేటాయించడం వల్ల ఒక్క వ్యక్తి లేదా సంస్థ మాత్రమే లాభపడుతుందని పేర్కొన్నారు. అదే స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, వాణిజ్య సముదాయాలు లేదా దుకాణాలు నిర్మిస్తే అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సంబంధించిన అనుమతులను వెంటనే నిలిపివేయాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



# జగిత్యాల అభివృద్ధికి ఎంపీ అర్వింద్ కృషి

**భోగ శ్రావణి**

జగిత్యాల, జూన్ 22 (ఈవార్తలు): ఎంపీ ధర్మపురి అర్వింద్ జగిత్యాల జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజా సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నారని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి కొనియాడారు. అంబారిపేట్, అంతర్గాం ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను గుర్తించిన ఎంపీ అర్వింద్, అక్కడ అండర్‌పాస్‌ల నిర్మాణ అవసరాన్ని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లడం అభినందనీయమని, ప్రజల అవసరాలను అర్థం చేసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఎంపీ చేసిన ప్రయత్నాల ఫలితంగా జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–563) నాలుగు లేన్ల విస్తరణకు, జగిత్యాల బైపాస్ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా అంతర్గాం, అంబారిపేట్ గ్రామాల వద్ద అండర్‌పాస్‌ల ఏర్పాటుకు కూడా నిర్ణయం తీసుకోవడం జిల్లా ప్రజలకు శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. జిల్లా ప్రజల తరఫున ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు



# ఆడబిడ్డలకు రేవంత్ కానుక.. ఇందిరమ్మ చీర

## రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేశ్

కూకట్‌పల్లి, జూన్ 22 (ఈవార్తలు): ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం కేపీహెచ్‌బీ కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేశ్ హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టారు అన్నారు. ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులను మహిళలకే కేటాయించారన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 70 వేల మంది మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా ఈ చీరల పంపిణీ కార్యక్రమం అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య ,కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్ రెడ్డి, పిడికిటి గోపాల్ చౌదరి, కిలారు శ్రీనివాస్, బాబు, రంగమోహన్ ,రజిత, కల్పన, వాణి, సుజాత, వనజ, జ్యోతి, రజిని, మైఖేల్, బాబ్జీ, రమణ, వాసు, బొచ్చు మల్లి, తమ్మినేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మల్యాల మండలానికి రూ.2.39 కోట్ల నిధులు

**సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు గ్రీన్ సిగ్నల్**

మల్యాల, జూన్ 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలానికి కొత్తగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం తెలిపిన వివరాల ప్రకారం, మల్యాల మండలానికి రూ. 2 కోట్ల 39 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు నిధులు మంజూరు కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి

# అభివృద్ధితోనే విమర్శలకు జవాబిస్తా

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ స్పష్టీకరణ.. రాయికల్‌లో రహదారి పనులను పరిశీలన

రాయికల్, జూన్ 22 (ఈవార్తలు): అభివృద్ధి పనులతోనే విమర్శకులకు సమాధానం చెబుతానని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలంలోని బషీర్‌పల్లి–చింతలూరు గ్రామాల మధ్య రూ.68 లక్షల వ్యయంతో చేపట్టిన రహదారి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై వస్తున్న విమర్శలకు తాము చేపడుతున్న అభివృద్ధి పనుల ద్వారానే సమాధానం ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సహకారంతో జగిత్యాల నియోజకవర్గానికి సుమారు రూ.200 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరైనట్లు చెప్పారు. హామ్ స్కీమ్ కింద పలు కొత్త రహదారులకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. రాయికల్ మండలంలో ఉప్పుమడుగు–లింగాపూర్–ధవన్‌పల్లి, జగిత్యాల–కండ్లపల్లి–కిష్టంపేట, మూటపల్లి–కొత్తపేట డబుల్ రోడ్డు, కొత్తపేట–లింగాపూర్ (వడ్డెర కాలనీ మీదుగా), లింగాపూర్–తాట్లవాయి డబుల్ రోడ్డు పనులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అదేవిధంగా ఈజీఎస్ కింద రూ.2.30 కోట్లతో రోడ్డు పనులకు ఆమోదం లభించిందని వెల్లడించారు. హామ్ స్కీమ్‌లో నిర్మించే రహదారులను 15 సంవత్సరాల పాటు కాంట్రాక్టర్ నిర్వహణ బాధ్యతలు చేపడతారని తెలిపారు. రాయికల్ మండలంలోని అన్ని ప్రధాన రహదారులను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.





## తెలుగును చూస్తే జిలేబీలు గుర్తొస్తాయి: జయసుధ



నటుడు రాజా రవీంద్ర హోస్ట్ చేస్తోన్న ఒక పాడ్ క్యాస్ట్ ఇంటర్వ్యూలో జయసుధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తన వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ.. “నాకు ఇప్పటివరకు తెలుగు రాయడం కానీ, చదవడం కానీ రాదు” అని చెప్పారు. ఇక మొన్నటికి మొన్న కూడా ట్రై చేస్తే.. ‘జయసుధ’ అని రాయబోయి ‘జభసుధ’ అని తప్పుగా రాశానని ఆమె నవ్వుతూ చెప్పుకొచ్చారు. తాను చెన్నైలో తమిళ్, ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నానని, అందుకే ఆ రెండు భాషలు బాగా వచ్చని జయసుధ తెలిపారు. తమిళంలో కేవలం 18 అక్షరాలే ఉంటాయి కాబట్టి అది చాలా ఈజీగా వచ్చేసిందని, కానీ తెలుగులో 56 అక్షరాలు ఉండటం వల్ల నేర్చుకోవడం కష్టమైందని చెప్పారు. అంతేకాదు, “నేను జిలేబీలు చూసిన ప్రతి సారీ నాకు తెలుగు అక్షరాలే గుర్తొస్తుంటాయి.. అంత కన్ఫ్యూజింగ్‌గా ఉంటాయి” అంటూ సరదాగా తెలిపా రు. ఇక భాష రాయడం, చదవడం రాకపోయినా మరి అన్ని వందల సినిమాల్లో అంత పెద్ద పెద్ద డైలాగులు ఎలా చెప్పారు? అనే డౌట్ అందరికీ రావచ్చు. దానికి జయసుధ సమాధానం ఇస్తూ.. దేవుడు తనకు ఒక మంచి గిఫ్ట్ ఇచ్చాడని అన్నారు. ఇక ఎవరైనా డైలాగ్స్ చెప్తుంటే వాటిని శ్రద్ధగా విని, మనసులో గుర్తుపెట్టుకుని కెమెరా ముందు అద్భుతంగా చెప్పడం తనకు అలవాటని, ఆ టాలెంట్‌తోనే ఇన్నేళ్లు మేనేజ్ చేశానని క్లారిటీ ఇచ్చారు.





## కాజల్ సెకండ్ ఇన్నింగ్స్ గాడిలో పడేనా?

ఒక స్టార్ హీరోయిన్ కెరీర్‌లో కొన్ని సినిమాలు కేవలం మరో ప్రాజెక్ట్‌లా కాకుండా, భవిష్యత్తును నిర్దేశించే మలుపులుగా నిలుస్తాయి. ప్రస్తుతం కాజల్ అగర్వాల్‌కు ఎన్‌బీకే111 కూడా అలాంటి ప్రాజెక్ట్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే దాదాపు రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కాజల్, పెళ్లి మరియు మాతృత్వం తర్వాత మళ్లీ కెరీర్‌పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. అయితే కంబ్యాక్ తర్వాత ఆమె చేసిన సినిమాలు ఆశించిన స్థాయిలో కొత్త అవకాశాల వరదను తీసుకురాలేకపోయాయి. ఇలాంటి సమయంలో బాలకృష్ణ హీరోగా తెరకెక్కుతున్న ఎన్‌బీకే111 కాజల్‌కు అత్యంత కీలక ప్రాజెక్టుగా మారింది. ముఖ్యంగా ఈ సినిమాలో ఆమెకు కేవలం సాంగ్స్ కు, గ్లామర్ కు మాత్రమే పరిమితమయ్యే పాత్ర కాకుండా కథలో ప్రభావం చూపే పాత్ర దక్కినట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. గత కొంతకాలంగా కాజల్ పాత్రల ఎంపికలో కూడా మార్పు కనిపిస్తోంది. పారితోషికం కంటే పాత్రకు ఉన్న ప్రాధాన్యత, కథలో ఆమె పాత్ర ప్రభావం వంటి అంశాలనే ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటోందనే అభిప్రాయం ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఎన్‌బీకే111 విషయంలో కూడా అదే అంశం కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. భారీ స్టార్ సినిమా కావడం ఒక కారణమైతే, తన పాత్రకు ఉన్న వెయిటేజీ మరో ప్రధాన కారణంగా చెప్పుకుంటున్నారు. కెరీర్ ఈ దశలో హీరోయిన్లకు గుర్తుండిపోయే పాత్రలే ఎక్కువకాలం ప్రయోజనం చేకూరుస్తాయని కాజల్ బాగా అర్థం చేసుకున్నట్లు కనిపిస్తోంది.



## సైలెంట్‌గా పెళ్లి చేసుకున్న బిగ్ బాస్ షణ్ముఖ్!

బిగ్ బాస్ షణ్ముఖ్.. ఇటీవల వైష్ణవి అనే అమ్మాయితో రహస్యంగా నిశ్చితార్థం చేసుకోగా.. తాజాగా వైష్ణవి చోడిశెట్టి మెడలో మూడు ముళ్ళు వేస్తున్న వీడియో సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. పట్టు వస్త్రాలలో లక్ష్మీనారాయణులలా ఈ జంట అందరి దృష్టిని ఆకర్షించారు. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో వీరి వివాహం జరిగింది. ఇకపోతే షణ్ముఖ్.. వైష్ణవితో పెళ్లి విషయాన్ని ఎక్కడ అధికారికంగా ప్రకటించలేదు. కానీ వీరి బెస్ట్ ఫ్రెండ్ సాహిత్య ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన వీడియోలను, ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో అసలు విషయం బయటకు వచ్చింది. ఈ జంటకు సంబంధించిన పెళ్లి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో అభిమానులు, సినీ సెలబ్రిటీలు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



## బాక్సాఫీస్ లక్కీ చార్మ్‌గా రష్మిక

ఒక హీరోయిన్ సినిమా హిట్ కావడం కామనే. కానీ ఆమె నటించిన సినిమాలు వరుసగా వందల, వేల కోట్ల వసూళ్లు సాధిస్తే మాత్రం అది చెప్పుకోవాల్సిన విషయమే. ప్రస్తుతం అలాంటి రేంజ్ లో ఉన్న హీరోయిన్ రష్మిక మందన్న. స్టార్ హీరోల సరసన నటిస్తూ.. పాన్ ఇండియా మార్కెట్ లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆమె.. ఇప్పుడు బాక్సాఫీస్‌కు లక్కీ చార్మ్ గా మారిపోయారు. ఇప్పటికే ఆమె నటించిన సినిమాల ద్వారా రూ.4వేల కోట్లకు పైగా వసూళ్లు నమోదవ్వగా, రష్మిక చేతిలో ఉన్న భారీ ప్రాజెక్టులను చూస్తే.. రాబోయే రెండేళ్లలో ఆ నెంబర్ మరింత పెరగడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. నిజానికి రష్మిక కెరీర్ కు అతిపెద్ద టర్నింగ్ పాయింట్ గా నిలిచింది పుష్ప. శ్రీవల్లి రోల్ తో ఓ రేంజ్ లో గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. పుష్ప 2తో ఆ క్రేజ్ ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఆ తర్వాత వచ్చిన యానిమల్ ఆమెకు మరింత గుర్తింపు తీసుకొచ్చింది. భారీ వసూళ్లతో పాటు నటిగా కూడా ప్రశంసలు అందుకుంది. తెలుగులో అనేక సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన రష్మిక.. కమర్షియల్ సినిమాల్లో గ్లామర్ పాత్రలు చేయడమే కాకుండా.. కథకు ఇంపార్టెన్స్ ఉన్న చిత్రాల్లోనూ తన ముద్ర వేసింది. ‘ అయితే ప్రస్తుతం సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నది ఆమె లైనప్. విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న రణబాలిపై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. అలాగే అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లోనూ రష్మిక కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ చిత్రం విజయం సాధిస్తే.. రష్మిక ఖాతాలో మరో బిగ్ హిట్ చేరే అవకాశం ఉందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. ఇక పుష్ప 3 కూడా ఆమె కెరీర్‌లో అత్యంత కీలక చిత్రాల్లో ఒకటిగా మారనుంది.

## ఆ రెండేళ్లు నరకం అనుభవించా: సమంత

సౌత్ స్టార్ హీరోయిన్ సమంత గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొన్న మయోసైటిస్ ఆరోగ్య సమస్యల గురించి మనందరికీ తెలిసిందే. ఆ కష్ట కాలం నుండి పూర్తిగా కోలుకున్న సమంత ప్రస్తుతం మళ్లీ నటిగా కెరీర్‌లో బిజీ అయిపోయారు. ఇటీవలే ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరును వివాహం చేసుకుని హ్యాపీ లైఫ్ లీడ్ చేస్తున్నారు. ఒకవైపు వ్యక్తిగత జీవితం ఆనందంగా సాగుతుండగా..మరోవైపు సామ్ ప్రధాన పాత్రలో నటించి.. నిర్మించిన -మా ఇంటి బంగారం- చిత్రం ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సక్సెస్ సెలబ్రేషన్స్ ఎంజాయ్ చేస్తున్న తరుణంలో సమంత తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మయోసైటిస్ వల్ల తాను పడ్డ కష్టాలను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మయోసైటిస్ బారిన పడిన ఆ రెండేళ్ల కాలాన్ని సమంత ఒక నరకంగా అభివర్ణించారు. ఆ సమయంలో ఆహార నియమాలు ఎంత కఠినంగా ఉండేవో చెబుతూ.. నచ్చిన ఆహారం తిందామన్నా ఒంటికి పడేది కాదు. ఆ సమయంలో నన్ను చూసిన చాలా మంది -డైట్ చేస్తున్నావా? ఎందుకు అలా బరువు తగ్గిపోతున్నావ్?- అని అడిగేవారు. కానీ నా వ్యక్తిగత జీవితంలో, నా ఆరోగ్య విషయంలో ఏం జరుగుతుందో అప్పట్లో ఎవరికీ తెలియదు. నేను కావాలని బరువు తగ్గలేదు, అనారోగ్యం వల్ల అలా అయిపోయాను. తినాలని ఉన్నా తినలేక ఆ రెండేళ్లు నరకం అనుభవించాను.. అంటూ సమంత ఆనాటి కష్టాలను ఓపెన్‌గా షేర్ చేసారు. అయితే ఇప్పుడు ఆ మహమ్మారి నుంచి పూర్తిగా కోలుకుని..నచ్చిన ఫుడ్ తింటున్నానని... కానీ దేనినైనా అతిగా తినకుండా జాగ్రత్త పడుతున్నానని తెలిపారు

## ప్రభాస్ పెళ్లి తర్వాతే నా పెళ్లి: డైరెక్టర్ నందినీ రెడ్డి



సినీ ఇండస్ట్రీలో సెలబ్రిటీల పెళ్లిళ్లు, పర్సనల్ లైఫ్స్ గురించి అభిమానులు ఎప్పుడూ ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ముఖ్యంగా స్టార్ హీరో ప్రభాస్ పెళ్లి ఎప్పుడు అనే ప్రశ్న చాలా ఏళ్లుగా చర్చనీయాంశంగా ఉంది. ఇప్పుడు అదే అంశాన్ని దర్శకురాలు నందినీ రెడ్డి సరదాగా ప్రస్తావించడంతో ఆమె కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సమంత లీడ్ రోల్ లో తెరకెక్కిన మా ఇంటి బంగారం మూవీతో ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన నందినీ రెడ్డి, ప్రమోషన్స్ సందర్భంగా తన పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ‘ప్రభాస్ పెళ్లి చేసుకున్న వెంటనే నేను కూడా పెళ్లి చేసుకుంటాను’ అంటూ నవ్వుతూ చేసిన కామెంట్స్ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అంతేకాదు, ప్రభాస్ తన క్రష్ అని కూడా ఆమె సరదాగా వెల్లడించారు. ‘ప్రభాస్ గారిని నా ముందుకు తీసుకొస్తే సిగ్గుపడతానేమో’ అని చెప్పడం అభిమానుల్లో మరింత ఆసక్తి పెంచింది. అయితే ఆ కామెంట్స్ వెనుక ఫన్ మాత్రమే కాదు, తన వ్యక్తిగత జీవితంపై నందినీ రెడ్డి చెప్పిన కొన్ని నిజాయితీ గల విషయాలు కూడా ఉన్నాయి. గతంలో ఆమె పెళ్లి చేసుకోకపోవడానికి గల కారణాలను వివరించారు. కాలేజీ రోజుల్లో ప్రేమలో పడ్డానని, కానీ ఆ ప్రేమ పెళ్లి వరకు వెళ్లలేదని చెప్పారు. తర్వాత సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన తరువాత తన ఆలోచనలను, ప్రొఫెషన్ అర్థం చేసుకునే వ్యక్తి దొరకలేదని వెల్లడించారు.



# సౌదీ చేతిలో స్పెయిన్ చిత్తు

ఫిఫా ప్రపంచకప్ (గ్రూప్-హెచ్ విభాగంలో స్పానిష్ ఫుట్‌బాల్ జట్టు సరికొత్త దూకుడుతో మైదానంలోకి దూసుకొచ్చి సంచలన విజయం సాధించింది. కేప్ వెర్డేతో జరిగిన మునుపటి మ్యాచ్‌లో అనూహ్య డ్రాతో నిరాశపరిచిన జట్టు ఫామ్‌పై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. వాటన్నింటికీ ఈ మ్యాచ్‌లో స్పెయిన్ ఆటగాళ్లు తమ అద్భుతమైన ప్రదర్శనతో మైదానంలోనే సమాధానం ఇచ్చారు. బలమైన సౌదీ అరేబియా జట్టును ఏకపక్షంగా 4-0 తేడాతో మట్టికరిపించి, ప్రతిష్టాత్మక మెగా టోర్నమెంట్‌లో తమ తొలి గెలుపును ఘనంగా నమోదు చేశారు. స్పెయిన్ సాధించిన ఈ చారిత్రక విజయానికి ప్రధాన కారణం 18 ఏళ్ల సంచలన యువ వింగర్ లామిన్ యమాల్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. కేవలం ఫిట్‌నెస్ సమస్యల కారణంగా టోర్నీ తొలి మ్యాచ్‌లో మైదానంలోకి దిగలేకపోయిన లామిన్ యమాల్.. ఈసారి అత్యంత కీలకమైన స్టార్టింగ్ ఎలెవన్‌లో స్థానం సంపాదించాడు. తనకు దక్కిన ఈ అద్భుతమైన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుంటూ ఆట ప్రారంభమైన కేవలం 10 నిమిషాల లోపే ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌ను ముట్టడించి స్పెయిన్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. మికెల్ ఒయార్జాబల్ పంపిన ఖచ్చితమైన క్రాస్‌ను అదిరిపోయే రీతిలో గోల్‌గా మార్చి అభిమానులను మెప్పించాడు. సౌదీ అరేబియాపై సాధించిన ఈ గోల్‌తో లామిన్ యమాల్ ప్రపంచకప్ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన సరికొత్త రికార్డును నెలకొల్పాడు. ప్రపంచకప్ మ్యాచ్‌లలో తొలి ఓపెనింగ్ గోల్ సాధించిన రెండో అతి పిన్న వయస్కుడైన అంతర్జాతీయ ఆటగాడిగా నిలిచాడు. ఇంతకుముందు 1958వ సంవత్సరంలో బ్రెజిల్ తరఫున దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు పీలే కేవలం 17 ఏళ్ల వయస్సులో వేల్స్ జట్టుపై ఈ విధమైన గోల్ నమోదు చేశాడు. ఆ తర్వాత సుదీర్ఘ కాలానికి మళ్లీ ఈ ఘనత సాధించిన ఏకైక ఆటగాడిగా లామిన్ యమాల్ అరుదైన గుర్తింపు పొందాడు.




## ఫిఫాలో 'హైడ్రేషన్ బ్రేక్' అవసరం లేదు!

ప్రస్తుతం నార్త్ అమెరికాలో జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్‌లో తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఆటగాళ్లను కాపాడేందుకు ప్రవేశపెట్టిన ఒక నిబంధన ఇప్పుడు టోర్నమెంట్‌లోనే అతిపెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రతి మ్యాచ్‌లోనూ రెండు అర్ధభాగాల్లో మూడు నిమిషాల చొప్పున రెండు పర్యాయాలు తప్పనిసరిగా 'హైడ్రేషన్ బ్రేక్' (డ్రింక్స్ బ్రేక్) ఇవ్వాలని ఫిఫా ఆదేశాలు జారీ చేసింది. వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతి మ్యాచ్‌కు ఇది వర్తిస్తుంది. గతంలో వేడి ప్రదేశాల్లో జరిగిన టోర్నమెంట్‌ల అనుభవాల దృష్ట్యా, ఆటగాళ్లందరికీ ఒకే రకమైన రక్షణ కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఫిఫా చెబుతోంది. అయితే, ఈ నిర్ణయంపై ఫుట్‌బాల్ ప్రపంచంలోని ప్రముఖుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విరామాలు ఆట సహజమైన గమనాన్ని, డైనమిక్స్‌ను పూర్తిగా మార్చేస్తున్నాయని వారు వాదిస్తున్నారు. ఈ నిబంధన ఫుట్‌బాల్‌లోని ప్రముఖుల నుంచి విమర్శలకు దారితీస్తోందని జిన్హువా తన కథనంలో పేర్కొంది. ఉరుగ్వే హెడ్ కోచ్ మార్సెలో బియెల్సా ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వారిలో ముందున్నాడు. "ఈ బ్రేక్స్ ఆట లయను దెబ్బతీస్తున్నాయి. రెండు భాగాలుగా జరగాల్సిన ఆటను నాలుగు భాగాలుగా విడదీస్తున్నాయి. ఇవి ఆటకు కొత్తగా ఏమీ జోడించడం లేదు, కానీ చాలా నష్టం చేస్తున్నాయి. ఈ నిర్ణయానికి ముందు ఫుట్‌బాల్‌కు ఒక ప్రత్యేకత ఉండేది, ఇప్పుడు అది మారిపోయింది. అభిమానులు దాని సహజ లక్షణాల వల్లే ఆటను ఇష్టపడతారు" అని అన్నాడు. నెదర్లాండ్స్ కెప్టెన్ వర్జిల్ వాన్ డైక్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఆటగాళ్ల ఆరోగ్యం ముఖ్యమే అయినా, వాతావరణ పరిస్థితులను బట్టి బ్రేక్స్ అవసరమో కాదో నిర్ణయించాలని, అన్ని మ్యాచ్‌లకు తప్పనిసరి చేయడం సరికాదని అన్నాడు. మరోవైపు క్రీడా శాస్త్రవేత్తలు, మరికొందరు నిపుణులు ఫిఫా నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు. వాతావరణం సాధారణంగా అనిపించినప్పటికీ, ఇది ఆటగాళ్ల ఆరోగ్యానికి అవసరమైన రక్షణ చర్య అని వారు స్పష్టం చేస్తున్నారు.




## ఆసియా రిలే చాంపియన్స్‌గా భారత జట్టు

చైనాలో జరిగిన ఏసియన్ రిలే చాంపియన్‌షిప్‌లో భారత మహిళల 4-400మీ రిలే జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. శ్రాబణి నంద, ఎస్ఎస్ స్నేహ, సుదేశ్నా శివంకర్, తమన్నాతో కూడిన భారత జట్టు చాంపియన్స్‌గా అవతరించింది. ఫైనల్‌లో బలమైన చైనాను అధిగమించి భారత జట్టు గోల్డ్ మెడల్ సాధించింది. మన అమ్మాయిలు ఎంతో పట్టుదల, వేగంతో ఆకట్టుకున్నారు. 43.85 సెకన్లలోనే రేసు ముగించి సీజన్ బెస్ట్ పర్ఫామెన్స్ చేశారు. 44.09 సెకన్లతో చైనా జట్టు రెండో స్థానంలో నిలువగా.. థాయిలాండ్ టీమ్ 44.11 సెకన్లతో కాంస్యం సాధించింది. తమన్నా, స్నేహలకు ఈ టోర్నీలో రెండు పతకాలు సాధించారు. మిక్స్‌డ్ 4ఇ400మీ రిలేలో కాంస్యం సాధించిన భారత జట్టులో అనిమేశ్ కుజుర్, ప్రణవ్ గురవ్‌లతోపాటు వాళ్లిద్దరూ ఉన్నారు. అదే విభాగంలో భారత జట్టు రజత పతకం కూడా గెలిచింది. ఆ జట్టులో తీర్థేష్ పి శెట్టి, పూవమ్మ, భరత్ శ్రీధర, నీరు పాఠక్ ఉన్నారు. దీంతో ఆసియా రిలే చాంపియన్‌షిప్‌ను భారత్ మూడు పతకాలతో ముగించింది.

## టెస్ట్ క్రికెట్‌లోకి వచ్చేదే లేదు: కోహ్లీ



టీమిండియా బ్యాటింగ్ దిగ్గజం విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లోకి మళ్లీ వస్తాడంటూ కొన్నిరోజులుగా జరుగుతున్న ఊహాగానాలకు తెరపడింది. తాను టెస్ట్ ఫార్మాట్ నుంచి పూర్తిగా తప్పుకున్నానని, మళ్లీ వైట్ జెర్సీ ధరించే ఆలోచనే లేదని తేల్చిచెప్పాడు. ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలోని ద్వారకలో జరిగిన తన సొంత స్పోర్ట్స్‌వేర్ బ్రాండ్ 'వన్ 8' కొత్త షూస్ కలెక్షన్ లాంచ్ ఈవెంట్‌లో కోహ్లీ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ప్రముఖ హోస్ట్, కమెడియన్ డానిష్ సైత్ అడిగిన ఒక సరదా ప్రశ్నకు కోహ్లీ నవ్వుతూనే స్పష్టమైన సమాధానాన్ని ఇచ్చాడు. ఈ ఈవెంట్‌లో లాంచ్ చేసిన ప్రత్యేకమైన రెడ్ కలర్ బూట్ల ధరను రూ. 9,230గా నిర్ణయించారు. దీనిపై హోస్ట్ డానిష్ సైత్ స్పందిస్తూ.. కోహ్లీ టెస్ట్ కెరీర్ మొత్తం పరుగులు కూడా సరిగ్గా 9,230 కావడాన్ని గుర్తు చేశాడు. "మీ బ్రాండ్ బూట్ల విక్రయాలను, లాభాలను మరింతగా పెంచడానికి మీరు మళ్లీ టెస్ట్ క్రికెట్ ఆడి మరికొన్ని పరుగులు చేస్తారా?" అని డానిష్ సరదాగా ప్రశ్నించాడు. దానికి కోహ్లీ స్పందిస్తూ.. "నా బూట్లు తక్కువ ధరకే అమ్ముడైనా పర్లేదు కానీ.. నేను ఆ ఫేజ్ నుంచి పూర్తిగా బయటకు వచ్చేశాను. థాంక్యూ" అంటూ నవ్వుతూ బదులిచ్చాడు. దీంతో కొన్ని వారాలుగా కోహ్లీ కోచ్ చేసిన వ్యాఖ్యలతో తెరపైకి వచ్చిన రీఎంట్రీ వార్తలకు పూర్తిగా బ్రేక్ పడింది. విరాట్ కోహ్లీ తన 14 ఏళ్ల సుదీర్ఘ టెస్ట్ కెరీర్‌కు 2025 మే నెలలో గుడ్‌బై చెప్పాడు. మొత్తం 123 టెస్ట్ మ్యాచ్‌లలో 46.85 సగటుతో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలతో 9,230 పరుగులు సాధించాడు. భారత్ తరఫున అత్యధిక టెస్ట్ పరుగులు చేసిన నాలుగో బ్యాటర్‌గా నిలిచిన కోహ్లీ.. 68 మ్యాచ్‌లలో 40 విజయాలతో అత్యంత విజయవంతమైన టెస్ట్ కెప్టెన్‌గా కూడా రికార్డు సృష్టించాడు. ప్రస్తుతం 37 ఏళ్ల కోహ్లీ.. 2027 వన్డే వరల్డ్ కప్ లక్ష్యంగా వైట్-బాల్ క్రికెట్‌పై మాత్రమే దృష్టి సారిస్తున్నాడు. ఇటీవల హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆఫ్ఘనిస్థాన్ వన్డే సిరీస్‌కు దూరమైన విరాట్.. జూలైలో ఇంగ్లండ్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం ఫిట్‌నెస్ సాధించే పనిలో ఉన్నాడు.



## ఇంగ్లండ్‌కు 12 పాయింట్ల కోత

### స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ నిర్ణయం

స్లో ఓవర్ రేట్ కారణంగా ఇంగ్లండ్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. న్యూజిలాండ్‌తో ఓవల్ మైదానంలో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో ఘోర ఓటమిని చవిచూసిన ఇంగ్లండ్ జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మరో గట్టి షాక్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో నిర్ణీత సమయానికి ఓవర్లు పూర్తి చేయనందుకు గానూ ఇంగ్లండ్ జట్టుపై ఐసీసీ తీవ్రమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ప్రస్తుత ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టిక నుండి ఇంగ్లండ్‌కు చెందిన 12 విలువైన పాయింట్లను కోత విధిస్తున్నట్లు ఐసీసీ ప్రకటించింది. దీంతో పాటు జట్టులోని ఆటగాళ్లందరికీ మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా కూడా విధించింది. నిర్ణీత సమయం, అదనపు మినహాయింపులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా ఇంగ్లండ్ జట్టు నిర్ణీత లక్ష్యం కంటే 12 ఓవర్లు వెనుకబడి ఉన్నట్లు అంపైర్లు గుర్తించారు. డబ్ల్యూటీసీ నిబంధనల ప్రకారం.. తక్కువగా వేసిన ప్రతి ఓవర్‌కు ఒక పాయింట్ చొప్పున మొత్తం 12 పాయింట్లను ఐసీసీ కోసేసింది. ఒక టెస్టు మ్యాచ్ గెలిస్తే వచ్చే పాయింట్లను ఇంగ్లండ్ ఇలా స్లో ఓవర్ రేట్ వల్ల నష్టపోవడం గమనార్హం. ఇంగ్లండ్ తాత్కాలిక కెప్టెన్ జో రూట్ ఈ తప్పిదాన్ని అంగీకరించడంతో మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ఎలాంటి అధికారిక విచారణ లేకుండానే ఈ శిక్షను ఖరారు చేశారు.

## మహిళా క్రికెటర్లకు ఐసీసీ '6ఆర్'

### ప్రెగ్నెన్సీ తర్వాత ఆడేందుకు కొత్త గైడ్‌లైన్స్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సోమవారం మహిళా క్రికెటర్ల కోసం ఒక కీలకమైన ముందడుగు వేసింది. ప్రసవం తర్వాత తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు వీలు కల్పించే మార్గదర్శకాలను (గైడ్‌లైన్స్) విడుదల చేసింది. మాతృత్వం కారణంగా మహిళా క్రికెటర్ల కెరీర్ ముగిసిపోకూడదనే లక్ష్యంతో, వారికి అవసరమైన మద్దతును అందించేందుకు ఈ కొత్త పాలసీని తీసుకొచ్చింది. మాతృత్వం, ప్రొఫెషనల్ క్రికెట్ రెండూ ఏకకాలంలో సాధ్యమేనని చాటిచెప్పడం ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం. ఈ గైడ్‌లైన్స్‌లో భాగంగా '6-=' ఫార్ములాను ఐసీసీ ప్రతిపాదించింది. ఇందులో రెడీ (సిద్ధం కావడం), రివ్యూ (సమీక్ష), రీస్టోర్ (పునరుద్ధరణ), రీకండిషన్ (పునఃస్థితికి తీసుకురావడం), రిటర్న్ (తిరిగి ఆడటం), రిఫైన్ (మెరుగుపరచడం) అనే ఆరు దశలు ఉంటాయి. శారీరకంగా కోలుకోవడం నుంచి మొదలుకొని, వైద్య సమీక్షలు, నెమ్మదిగా శిక్షణ ప్రారంభించడం, క్రికెట్‌కు అవసరమైన కండిషనింగ్ సాధించడం, పోటీల్లోకి తిరిగి రావడం, ఆ తర్వాత కూడా ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం వరకు ప్రతీ అంశాన్ని ఈ ప్రణాళికలో పొందుపరిచారు. ఆస్ట్రేలియా జట్టు డాక్టర్, ఐసీసీ మెడికల్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలు డాక్టర్ ఫిలిప్పా ఇంగే మాట్లాడుతూ, "ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం.. బిడ్డకు జన్మనివ్వడం కెరీర్‌కు ముగింపు కాదని క్రీడాకారిణులకు భరోసా ఇవ్వడమే. చాలా దేశాల బోర్డులకు గతంలో ఇలాంటి పాలసీలు లేవు. అందుకే అన్ని దేశాలకూ అనుకూలంగా ఉండేలా, వారి అవసరాలకు తగ్గట్టు మార్చుకునేలా ఈ గైడ్‌లైన్స్‌ను రూపొందించాం. ఇది ఒక టెంప్లేట్ లాంటిది. ప్రతి క్రీడాకారిణి, వారి కుటుంబ అవసరాలకు అనుగుణంగా మద్దతు అందించాలి" అని వివరించారు. ఈ మార్గదర్శకాల ప్రకారం, ప్రతి క్రీడాకారిణికి ఒక ప్రత్యేక కేస్ మేనేజర్‌ను నియమించాలని సిఫార్సు చేశారు. సాధారణంగా డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ ఈ బాధ్యతలు చూస్తారు. గర్భం దాల్చినప్పటి నుంచి తిరిగి మైదానంలోకి అడుగుపెట్టే వరకు వీరే ఆమెకు ప్రతినిధిగా వ్యవహరిస్తారు. అంతేకాకుండా, మెడికల్ సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు, సైకాలజిస్టులు, డైటీషియన్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులతో కూడిన ఒక బృందం క్రీడాకారిణికి అండగా నిలవాలని ఐసీసీ సూచించింది.



## మార్కెట ఒంద్రుసోవాపై నిషేధం

మహిళల టెన్నిస్‌లో ఓ వెలుగు వెలుగిన మార్కెట ఒంద్రుసోవా నిషేధానికి గురైంది. డోపింగ్ టెస్టుకు నిరాకరించినందుకు భారీ మూల్యంగా ఆమె నాలుగేళ్లు ఆటకు దూరమవ్వనుంది. అథ్లెట్లు నిషేధిత డ్రగ్స్ ఉపయోగించారా? లేదా? అనేది తేల్చడం కోసం నిర్వహించే డోప్ పరీక్షల్ని తిరస్కరించిన ఒంద్రుసోవాపై స్వతంత్ర ట్రిబ్యునల్ విచారణ జరిపింది. ఆమె ఉద్దేశపూర్వకంగానే టెస్టుకు అంగీకరించలేదని తేలడంతో టెన్నిస్ నుంచి నాలుగేళ్లు సస్పెండ్ చేసింది. వింబుల్డన్ మాజీ ఛాంపియన్ అయిన ఒంద్రుసోవా నిరుడు డిసెంబర్‌లో డోప్ పరీక్షలకు నిరాకరించింది. ఆమెకు పరీక్షలు చేసేందుకు వెళ్లిన డోపింగ్ నియంత్రణ అధికారిని తను ఇంట్లోకి రానివ్వలేదు. దాంతో, అంతర్జాతీయ టెన్నిస్ సమగ్రత ఏజన్సీ ఆమెపై కేసు వేసింది. స్వతంత్ర ట్రిబ్యునల్ విచారణలో తాను ఒత్తిడిలో, మానసిక ఆరోగ్యం బాగా లేనందున తాను డోప్ టెస్టుకు సిద్ధపడలేని ఒంద్రుసోవా తెలిపింది. కానీ, ఆవేవీ సహేతుకమైన కారణాలు కాదని ట్రిబ్యునల్ తేల్చింది. దాంతో, ఉద్దేశపూర్వకంగానే టెస్టుకు దూరమైన ఆమెపై నాలుగేళ్ల నిషేధం విధించింది. 2030 జూన్ 31 వరకూ ఒంద్రుసోవాపై నిషేధం కొనసాగుతుందని ట్రిబ్యునల్ తెలిపింది. కోర్టు తీర్పును స్పోర్ట్స్ అర్బిట్రేషన్ కోర్టులో చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి సవాల్ చేసే అవకాశముంది.

# అప్పుడే మొదలైన ఐపీఎల్ పందేరాలు

**భారీ స్థాయిలో ముంబై ట్రేడ్!**

**ముంబైని వీడనున్న హార్దిక్**

**సూర్య కుమార్ యాదవ్ కూడా!**

**జైస్వాల్‌పై అంబానీ టీం కన్ను**

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన ముంబై ఇండియన్స్‌లో భారీ మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. కెప్టెన్‌గా విఫలమైన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టును వీడటం దాదాపు ఖాయమైంది. అతని స్థానంలో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను ట్రేడింగ్ ద్వారా జట్టులోకి తీసుకురావాలని ముంబై యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు జాతీయ క్రీడా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గుజరాత్ టైటాన్స్ నుంచి భారీ అంచనాలతో ముంబైకి తిరిగివచ్చిన హార్దిక్ పాండ్యా, కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జట్టును సమర్థంగా నడిపించలేకపోయాడు. జట్టు ప్రదర్శన పేలవంగా ఉండటంతో పాటు, డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా విభేదాలు తలెత్తినట్టు వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, ముంబై ఇండియన్స్‌తో తన ప్రయాణాన్ని ముగించుకోవాలని హార్దిక్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. '=వజూజూశీతీఓ' కథనం ప్రకారం.. హార్దిక్ పాండ్యాను రాజస్థాన్ రాయల్స్‌కు ఇచ్చి, ప్రతిగా యశస్వి జైస్వాల్‌ను తీసుకునేందుకు ఇరు ఫ్రాంచైజీల మధ్య చర్చలు చివరి దశలో ఉన్నాయని సమాచారం. మరోవైపు యశస్వి జైస్వాల్ కూడా రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీతో సంతోషంగా లేనట్టు తెలుస్తోంది. సంజూ శాంసన్ నిష్క్రమణ తర్వాత జట్టులో కీలక ఆటగాడిగా, కెప్టెన్సీ రేసులో జైస్వాల్ ముందుంటాడని భావించారు. అయితే, యాజమాన్యం అతని స్థానంలో రియాన్



పరాగ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. దీనికి తోడు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రాకతో జైస్వాల్ ప్రాధాన్యం తగ్గినట్టు భావిస్తున్నారు. ముంబై రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జైస్వాల్‌కు, ముంబై ఇండియన్స్‌లోకి రావడం కెరీర్ పరంగా ఎంతో మేలు చేస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. హార్దిక్ మాత్రమే కాకుండా స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ కూడా ముంబై ఇండియన్స్‌ను వీడే యోచనలో ఉన్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జట్టులోని సీనియర్ ఆటగాళ్లను వదులుకోవాలని యాజమాన్యం భావిస్తుండటంతో సూర్యకుమార్ కొత్త జట్టు వైపు చూస్తున్నాడు. అతనికి కెప్టెన్సీ ఆఫర్ ఇచ్చేందుకు ఉత్తరాదికి చెందిన రెండు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. రోహిత్ శర్మ కెరీర్ చివరి దశలో ఉండటం, హార్దిక్, సూర్యకుమార్ వంటి కీలక ఆటగాళ్లు జట్టును వీడితే ముంబై ఇండియన్స్‌కు కొత్త సూపర్ స్టార్లు అవసరమవుతారు. మూడు ఫార్మాట్లలో భారత జట్టులో కీలక ఆటగాడిగా ఎదుగుతున్న యశస్వి జైస్వాల్, జట్టు భవిష్యత్ ప్రణాళికలకు సరైన ఎంపిక అని యాజమాన్యం భావిస్తోంది. అయితే, అతనికి కెప్టెన్సీ బాధ్యతలు కూడా అప్పగిస్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# క్రికెట్‌కు మించి.. ఇంకేం చేయలేమా?

భారత్‌లో క్రీడల గురించి మాట్లాడితే ముందుగా గుర్తుకు వచ్చేది క్రికెట్. కోట్లాది మంది అభిమానులు, వేల కోట్ల రూపాయల పెట్టుబడులు, భారీ ప్రకటనలు, విస్తృత మీడియా కవరేజీ---ఇవన్నీ కలిసి క్రికెట్‌ను దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడగా నిలబెట్టాయి. అయితే ఇదే సమయంలో మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. క్రికెట్‌కు లభిస్తున్నంత ప్రోత్సాహం మిగిలిన క్రీడలకు ఎందుకు దక్కడం లేదు? ప్రపంచ క్రీడా శక్తిగా ఎదగాలంటే భారత్ క్రికెట్‌కు మాత్రమే కాకుండా అన్ని క్రీడలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇటీవలి ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ పోటీలను పరిశీలిస్తే భారత్‌కు పతకాలు తెచ్చిపెట్టింది ఎక్కువగా అథ్లెటిక్స్, షూటింగ్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, హాకీ, ఆర్చరీ వంటి క్రీడలే. పరిమిత వనరులు, తగిన సౌకర్యాలు లేకపోయినా మన క్రీడాకారులు ప్రపంచ వేదికపై తమ సత్తా చాటుతున్నారు. వారికి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, శిక్షణ, పోషకాహారం, శాస్త్రీయ మద్దతు అందితే ఫలితాలు మరింత మెరుగ్గా ఉండేవి. మన దేశంలో ప్రతిభ కొరత లేదు. కానీ ఆ ప్రతిభను వెలికితీసే వ్యవస్థలో లోపాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో, చిన్న పట్టణాల్లో అనేక మంది యువకులు సహజసిద్ధమైన క్రీడా నైపుణ్యాలను కలిగి ఉంటారు. అయితే సరైన మైదానాలు, కోచ్‌లు, శిక్షణా కేంద్రాలు, పరికరాలు లేక వారి ప్రతిభ ప్రారంభ దశలోనే ఆగిపోతుంది. ఆర్థిక ఇబ్బందులు, అవకాశాల కొరత, ప్రోత్సాహం లేకపోవడం వల్ల ఎంతో మంది తమ కలలను మధ్యలోనే వదులుకుంటున్నారు. క్రీడా మౌలిక సదుపాయాల విస్తరణ అనేది కేవలం పతకాల కోసమే కాదు. అది ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కూడా అవసరం. క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి. నేటి కాలంలో మొబైల్ ఫోన్లు, డిజిటల్ వినోదం కారణంగా పిల్లల్లో శారీరక శ్రమ తగ్గిపోతోంది. ప్రతి పాఠశాల, కళాశాల, మండల కేంద్రం, జిల్లా స్థాయిలో బహుళ క్రీడా వేదికలు ఏర్పాటు చేస్తే యువత ఆరోగ్యంతో పాటు దేశ క్రీడా భవిష్యత్తు కూడా బలోపేతమవుతుంది. ప్రభుత్వాల పాత్రతో పాటు ప్రైవేట్ రంగం, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు కూడా ముందుకు రావాలి. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను గ్రామీణ క్రీడా అకాడమీలు, శిక్షణా కేంద్రాలు, ప్రతిభావంతులైన క్రీడాకారుల అభివృద్ధికి వినియోగించవచ్చు. పాఠశాలల్లో మార్కులతో పాటు క్రీడా ప్రతిభకు కూడా సమాన గుర్తింపు ఇవ్వాలి. క్రీడలను పాఠ్యాంశంలో భాగంగా భావించి విద్యార్థులకు ప్రతిరోజూ సాధనకు అవకాశం కల్పించాలి. మహిళల క్రీడలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం అవసరం. భద్రమైన మౌలిక సదుపాయాలు, సమాన అవకాశాలు, ప్రోత్సాహక పథకాలు ఉంటే మహిళలు అంతర్జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించగలరు. అలాగే దివ్యాంగ క్రీడాకారుల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలు, అందుబాటులో ఉండే సౌకర్యాలు కల్పించడం కూడా సమాజ బాధ్యత. క్రీడల్లో పెట్టుబడులు వ్యయం కాదు–అవి దేశ భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడి. క్రీడా రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, క్రీడా పర్యాటకం అభివృద్ధి చెందుతుంది, క్రీడా పరికరాల తయారీ పరిశ్రమ విస్తరిస్తుంది. అంతేకాదు, అంతర్జాతీయ వేదికలపై భారత ప్రతిష్ఠ మరింత పెరుగుతుంది. క్రికెట్ మన గర్వకారణమే. కానీ భారత్ వంటి విస్తారమైన జనాభా కలిగిన దేశం ఒక్క క్రీడపైనే ఆధారపడలేను. ప్రతి గ్రామంలో ఒక అథ్లెట్, ప్రతి పట్టణంలో ఒక ఈతగాడు, ప్రతి జిల్లాలో ఒక విలువిద్యాకారుడు, ప్రతి రాష్ట్రంలో ఒక ప్రపంచ విజేత దాగి ఉండొచ్చు. వారికి అవసరమైనది కేవలం ఒక అవకాశం, సరైన వేదిక.

# సంస్కృతిపై సినిమా అప్పర్‌హ్యాండ్!

**తెలంగాణ సమాజంలో సినిమా మాధ్యమం ఒక శక్తివంతమైన సామాజిక శక్తిగా ఎదిగింది. ఒకప్పుడు వినోదానికి మాత్రమే పరిమితమైన సినిమా, ప్రస్తుతం ప్రజల జీవనశైలి, భాష, ఆలోచనా విధానం, సాంస్కృతిక ప్రవర్తనలను ప్రభావితం చేసే ప్రధాన మాధ్యమంగా మారింది. ప్రత్యేకంగా తెలుగు సినిమా పరిశ్రమ విస్తరణతో తెలంగాణ ప్రాంత ప్రజలపై దాని ప్రభావం మరింత వేగంగా పెరిగింది. సామాజిక పరిశీలనలు, విద్యా సంస్థల సర్వేలు, మీడియా అధ్యయనాలు సూచిస్తున్న దాని ప్రకారం సినిమా ప్రభావం యువతపై అత్యధికంగా ఉంది. సుమారు 65% యువత సినిమాను ప్రవర్తనా నమూనాగా స్వీకరిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ ప్రభావం భాష, వేషధారణ, సంప్రదాయాల రూపాంతరంలో స్పష్టంగా కనిపిస్తోంది.**





డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

తెలంగాణ ప్రాంతంలో భాషా పరమైన మార్పులు సినిమా ప్రభావానికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తున్నాయి. స్థానిక యాసకు ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, సినిమాల్లో ఉపయోగించే మిశ్రమ తెలుగు శైలి కారణంగా యువత భాషలో మార్పులు వస్తున్నాయి. సర్వేలు ప్రకారం సుమారు 55% యువత సినిమా డైలాగ్ శైలిని రోజువారీ సంభాషణలో ఉపయోగిస్తున్నారు. ఇది స్థానిక భాషా స్వచ్ఛతపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ప్రభావం మరింత బలంగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది సుమారు 35% నుండి 40% వరకు విస్తరించినట్లు అంచనా. భాషా రూపాంతరం ఒకవైపు ఆధునికతను తీసుకువస్తున్నప్పటికీ, మరోవైపు స్థానిక గుర్తింపును బలహీనపరుస్తోందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. వేషధారణ విషయంలో కూడా సినిమా ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సుమారు 60% యువత సినిమా నటుల ఫ్యాషన్‌ను అనుసరిస్తున్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. దుస్తుల ఎంపిక, హెయిర్ స్టైల్, ప్రవర్తన శైలి వరకు సినిమా ప్రభావం విస్తరించింది. పట్టణ యువతలో ఈ ప్రభావం మరింత వేగంగా పెరుగుతూ ఆధునిక జీవనశైలిని ప్రోత్సహిస్తోంది. అయితే ఇది సంప్రదాయ వేషధారణ తగ్గుదలకు కూడా కారణమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ దుస్తుల వినియోగం కొనసాగుతున్నప్పటికీ సినిమా ప్రభావం అక్కడ కూడా క్రమంగా పెరుగుతోంది. సంప్రదాయాలు, ఆచారాల విషయంలో సినిమా ప్రభావం మిశ్రమ స్వభావాన్ని చూపుతోంది. పండుగల వేడుకలు, వివాహాల ఆచారాలు, సామాజిక కార్యక్రమాల్లో సినిమా శైలులు ప్రవేశించడం సుమారు 40% వరకు నమోదవుతోంది. కొన్ని సందర్భాల్లో సంప్రదాయాల రూపం మారిపోతున్నప్పటికీ వాటి అసలు భావం పూర్తిగా నశించడం లేదు. కుటుంబ విలువల విషయంలో సుమారు 30% మార్పులు కనిపిస్తున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. యువతలో వ్యక్తిగత స్వేచ్ఛ పెరుగుతున్నప్పటికీ సంప్రదాయ నియమాలపై ఆసక్తి కొంత తగ్గుతున్న ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.

సినిమా ప్రభావం కేవలం ప్రతికూలంగానే కాకుండా సానుకూల కోణాన్ని కూడా కలిగి ఉంది. సుమారు 40% యువత సామాజిక సమస్యలపై అవగాహనను సినిమాల ద్వారా పొందుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. సృజనాత్మకత, ఆలోచనా విస్తరణ, వ్యక్తీకరణ నైపుణ్యాలు సుమారు 35% వరకు పెరిగినట్లు పరిశీలనలు తెలియజేస్తున్నాయి. విద్యార్థుల్లో ప్రేరణ, లక్ష్య సాధన భావన కూడా సినిమాల ద్వారా పెరుగుతోంది. అయితే ఈ సానుకూల ప్రభావంతో పాటు అనుకరణ ధోరణి కూడా సమాంతరంగా పెరుగుతోంది. మొత్తంగా చూస్తే సినిమా మాధ్యమం తెలంగాణ సంస్కృతిపై సుమారు 50% నుండి 65% వరకు ప్రభావం చూపుతున్నట్లు సామాజిక అధ్యయనాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రభావం భాష, వేషధారణ, ఆచారాలు, జీవనశైలి అన్ని రంగాల్లో కనిపిస్తోంది. సినిమా ఒక వైపు ఆధునికతను అందిస్తున్నప్పటికీ మరోవైపు సంప్రదాయ విలువలను రూపాంతరం చేస్తోంది. అందువల్ల సమాజంలో సాంస్కృతిక సమతుల్యత అవసరం మరింత ముఖ్యమవుతోంది. యువతలో అవగాహన పెంచడం, స్థానిక సంస్కృతి పరిరక్షణపై దృష్టి పెట్టడం ద్వారా సినిమా ప్రభావాన్ని సమతుల్యంగా మార్చుకోవచ్చు. సినిమా ప్రభావం తెలంగాణ సమాజంలో కేవలం ఉపరితల స్థాయిలోనే కాకుండా లోతైన సామాజిక నిర్మాణాల్లోకి ప్రవేశించింది. కుటుంబ వ్యవస్థ, విద్యార్థుల ప్రవర్తన, ప్రేమ భావనలు, సామాజిక విలువలు అన్నింటిపైనా సినిమా చూపిస్తున్న ప్రభావం గణనీయంగా పెరుగుతోంది. ఇటీవల నిర్వహించిన పరిశీలనల ప్రకారం సుమారు 68% యువత తమ ఆలోచనా విధానాన్ని సినిమాల నుండి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తీసుకుంటున్నట్లు వెల్లడైంది. ఇది ఒకవైపు సృజనాత్మకతను పెంచుతున్నప్పటికీ మరోవైపు వాస్తవ జీవన పరిస్థితులపై అసమతుల్య అంచనాలను కూడా సృష్టిస్తోంది. తెలంగాణ యువతలో భావోద్వేగ వ్యక్తీకరణ విధానం కూడా సినిమాల ప్రభావంతో మారుతోంది. ప్రేమ, స్నేహం, కుటుంబ సంబంధాలు వంటి అంశాలను సినిమాల్లో చూపించే నాటకీయతతో పోల్చుతూ నిజ జీవితంలో కూడా అదే స్థాయిలో భావాలను వ్యక్తం చేయాలనే ధోరణి పెరుగుతోంది. సుమారు 57% యువత సినిమా శైలిలో భావోద్వేగాలను వ్యక్తపరుస్తున్నట్లు సామాజిక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది సంబంధాల్లో అతిశయ భావోద్వేగాలకు దారితీసే అవకాశం ఉంది. విద్యార్థుల జీవితంలో కూడా సినిమా ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. లక్ష్య నిర్దేశం, కెరీర్ ఎంపిక, జీవన శైలి ఆశయాలు అన్నీ సినిమాల ద్వారా ప్రభావితమవుతున్నాయి. సుమారు 52% విద్యార్థులు సినిమా పాత్రల ప్రేరణతో కెరీర్ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అయితే ఇది కొన్నిసార్లు వాస్తవ ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల అసంతృప్తికి దారితీస్తోంది. సినిమాల్లో చూపించే హింస, రొమాంటిక్ అతి భావోద్వేగాలు, విలాస జీవనశైలి కూడా యువతపై ప్రభావం చూపుతున్నాయి. సుమారు 48% యువత సినిమా సన్నివేశాల నుండి ప్రవర్తనా నమూనాలను స్వీకరిస్తున్నట్లు పరిశీలనలు తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సినిమాలు యువతలో ఆగ్రహ ప్రదర్శన విధానాలను కొంతవరకు ప్రభావితం చేస్తున్నాయి. ఇది సామాజిక నియంత్రణ వ్యవస్థపై కొత్త సవాళ్లను సృష్టిస్తోంది.

తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకత అయిన జానపద కళలు, యాస, సంప్రదాయ సంగీతం సినిమా ప్రభావంతో కొత్త రూపం దాలుస్తున్నాయి. జానపద కళలపై ఆసక్తి 38% వరకు తగ్గినప్పటికీ కొన్ని సినిమాలు వాటిని పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇది సంస్కృతి పరిరక్షణకు ఒక కొత్త మార్గంగా అభివృద్ధి చెందుతోంది. సోషల్ మీడియా విస్తరణ సినిమా ప్రభావాన్ని మరింత వేగవంతం చేసింది. సినిమా డైలాగులు, పాటలు, స్టైళ్లు క్షణాల్లో వైరల్ అవుతూ యువతలో అనుకరణ ధోరణిని పెంచుతున్నాయి. సుమారు 72% యువత సోషల్ మీడియా ద్వారా సినిమా ట్రెండ్స్‌ను అనుసరిస్తున్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది సాంస్కృతిక మార్పును మరింత వేగవంతం చేస్తోంది. గ్రామీణ తెలంగాణలో కూడా సినిమా ప్రభావం క్రమంగా పెరుగుతోంది. టెలివిజన్, మొబైల్ ఫోన్లు విస్తరించడంతో గ్రామీణ యువతలో 40% నుండి 50% వరకు సినిమా ప్రభావం చేరినట్లు అంచనా. ఇది పట్టణ, గ్రామాల మధ్య ఉన్న సాంస్కృతిక తేడాలను తగ్గిస్తూ ఒకే రకమైన జీవనశైలిని ఏర్పరుస్తోంది. మొత్తంగా సినిమా మాధ్యమం తెలంగాణ సమాజంపై ఒక బలమైన సాంస్కృతిక రూపాంతర శక్తిగా పనిచేస్తోంది. సుమారు 60% నుండి 70% వరకు యువతపై ప్రత్యక్ష ప్రభావం చూపుతూ భాష, వేషధారణ, ఆలోచనా విధానం, విలువల వ్యవస్థను మార్చుతోంది. ఈ మార్పు పూర్తిగా నష్టకరం కాదు, పూర్తిగా లాభదాయకమూ కాదు. ఇది ఒక మిశ్రమ పరిణామం. అందువల్ల సంస్కృతి పరిరక్షణ, ఆధునికత స్వీకరణ మధ్య సమతుల్యత సాధించడం అత్యంత అవసరం. సోషల్ మీడియా సినిమా ప్రభావాన్ని మరింత వేగవంతం చేసింది. సినిమా పాటలు, డైలాగులు, డాన్స్ స్టెప్పులు క్షణాల్లో వైరల్ అవుతూ యువతలో అనుకరణ ధోరణిని పెంచుతున్నాయి. సుమారు 75% యువత సోషల్ మీడియా ద్వారా సినిమా ట్రెండ్స్‌ను అనుసరిస్తున్నట్లు అంచనా. ఇది సంస్కృతి మార్పును మరింత వేగవంతం చేస్తోంది. మొత్తంగా చూస్తే సినిమా మాధ్యమం తెలంగాణ సమాజంలో ఒక బలమైన సాంస్కృతిక మార్పు కారకంగా పనిచేస్తోంది. ఇది భాష, వేషధారణ, ఆలోచన, విలువలు, జీవనశైలి అన్నింటినీ ప్రభావితం చేస్తోంది. సుమారు 60% నుండి 70% వరకు యువతపై ప్రత్యక్ష ప్రభావం ఉన్నట్లు సమగ్ర విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఈ మార్పు పూర్తిగా మంచిదీ కాదు, పూర్తిగా చెడుదీ కాదు. ఇది ఆధునికత, సంప్రదాయం మధ్య జరుగుతున్న నిరంతర పరివర్తన. అందువల్ల భవిష్యత్తులో సంస్కృతి పరిరక్షణ, మీడియా అవగాహన, విద్యా మార్గదర్శనం మరింత అవసరం అవుతుంది. తెలంగాణ సమాజంలో సినిమా మాధ్యమ ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించినప్పుడు ఇది ఒక సాధారణ వినోద సాధనం స్థాయిని దాటి, బలమైన సాంస్కృతిక రూపాంతర శక్తిగా పనిచేస్తున్నట్లు స్పష్టమవుతుంది. భాష, వేషధారణ, ఆచారాలు, జీవనశైలి, విలువల వ్యవస్థ అన్నీ సినిమా ప్రభావంతో క్రమంగా మార్పుకు లోనవుతున్నాయి. ఈ మార్పు ఒక్కరోజులో సంభవించినది కాదు, గత రెండు నుండి మూడు దశాబ్దాలుగా క్రమంగా విస్తరించిన సామాజిక పరిణామం. ముఖ్యంగా యువత ఈ మార్పులో ప్రధాన పాత్ర పోషిస్తోంది. సుమారు 60% నుండి 70% యువత ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సినిమా ప్రభావానికి లోనవుతున్నట్లు వివిధ సామాజిక పరిశీలనలు సూచిస్తున్నాయి.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.